# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

**గూడూరి వెంకటరత్నం**

**డి.జె. బాలకృష్ణ లాల్**

**డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి**

**మిస్.పి. ఇందిరాదేవి**

**జి.ఎస్.ఆర్. మూర్తి**

**డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు**

**డా॥ యమ్.స్వర్ణముఖి**



Volume 29 Issue 6

No.of Pages 40

FEBRUARY 2010

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్స్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్స్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,


**ఈ సంచికలో....** **పేజీ**


| ఈ సంచికలో.... | పేజీ |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| బాబూజీ ఉవాచ | 5 |
| మాతాజీఅభిభాషణ | 8 |
| సన్నిధిలోసంభాషణ | 11 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 14 |
| సత్సంగసారభం | 15 |
| సంత్‌నామదేవ్ చరితామృతం | 17 |
| గురుకృప | 20 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 22 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 24 |
| మాతాజీ బోధామృతం | 27 |
| మాతాజీ సత్సంగ్ డైరీ | 30 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 33 |
| సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర | 35 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

# భద్రవాక్యం

**శ్లో॥ కామ్యోపాసనయార్థయ న్త్యనుదినం కించిత్ఫలం స్వేప్సితమ్**
**కించిత్స్వర్గ మథాపవర్గమపరైర్యోగాది యజ్ఞాదిభిః**
**అస్మాకం యదునంద నాంఘ్రి యుగళ ధ్యానావధానార్థినామ్**
**కిం లోకేన దమేన కిం నృపతినా స్వర్గాపవర్గైశ్చకిమ్॥**

**- ప్రబోధసుధాకరము**

కొందరు విషయ సుఖాలలో లభించే ఆనందమే అన్నిటికన్న మిన్న అనుకుంటారు. కొందరు స్వర్గ సుఖాలకన్న మోక్షం కన్న ఆనందం లేదనుకుంటారు. నిర్వికల్ప సమాధిలో కలిగే నిర్విషయానందంకన్న మించినది లేదు అని కొందరు అంటారు. అద్వైత మత స్థాపకాచార్యులైన శంకర భగవత్పాదాచార్యుల వారు ఏమంటున్నారో చూడండి.

ప్రపంచంలో కొందరు తాము కోరినది ఏ దేవతను ఏ విధంగా ఉపాసన చేస్తే లభిస్తుందని చెప్పబడిందో, ఆయా ఉపాసనలద్వారా, ఆయా కోరికలను తీర్చుకోవటానికి ప్రయత్నిస్తారు. వారు అలా ఉపాసిస్తే ఉపాసించి ఆ కోర్కెలను తీర్చుకుంటే తీర్చుకోనీ. మరికొందరు స్వర్గభోగాలను లేదా అపవర్గము అంటే మోక్షం పొందటానికి యజ్ఞ యాగాది వైదిక కర్మలను ఎంత శ్రమ పడి అయినా, శాస్త్రంలో చెప్పబడినట్లు, తూ.చ తప్పక ఆచరిస్తారు. వారు ఆ యజ్ఞయాగాది వైదికకర్మలు ఆచరిస్తే ఆచరించి, వాటిని పొందితే పొందనీ. యోగసిద్ధికోసం కొందరు ఇంద్రియాలను నిగ్రహిస్తారు. వారు అలా ఇంద్రియ నిగ్రహాన్ని పాటించి యోగాన్ని సాధిస్తే సాధించనీ. ఇంకా కొందరు ఇహలోక సుఖాలను పొందటంకోసం రాజులను ఆశ్రయిస్తారు. వారు రాజాశ్రయాన్ని పొంది, సుఖలబ్ధిని పొందితే పొందనీ.

మాకు అవేవీ అక్కరలేదు. నిరంతరం యదువంశవర్ధనుడైన ఆ శ్రీకృష్ణస్వామి దర్శనము, ఆ స్వామి దివ్య చరణారవిందాలను ధ్యానించటమందలి శ్రద్ధ ప్రసాదించే ఆనందమే మాకు చాలు. ఎందుకంటే ఆ అలౌకిక ఆనందం ముందు ఈ లౌకిక ఆనందం, స్వర్గభోగాలు, సామీప్య, సాలోక్య, సారూప్య సాయుజ్యరూపమైన మోక్షంసైతం చాలా అల్పమైనవి కనుక అంటారు ఆచార్యులవారు. *

# అమ్మ ఆశీస్సులు

గత నెల భోగినాడు రుక్మిణీ కళ్యాణ ఘట్టాన్ని శ్రవణం చేశాం. శ్రీ సద్గురు దేవుల పాదపూజ చేసికొన్నాం. రాత్రి 8 గంటలకు భక్తులందరూ శ్రీ గురుదేవులకు భోగిపళ్ళు పోసికొని, శ్రీ స్వామివారికి హారతులిచ్చి, రేగుపళ్ళను, పువ్వులను నాణెములను ప్రసాదంగా పొందారు.

"యుద్ధరంగంలో నేను వేసే వాడి బాణాలకు నొచ్చి శ్రీ కృష్ణుడు ఒక్కుదుటున కుండలాల కాంతి ఆకాశమంతా నిండగా రథంపైనుండి దూకగా, ఉదరములోని జగత్తులు కదలగా,బుజం పైన వల్లెవాటుగా ఉన్న పీతాంబరము జారిపోతుండగా చేత చక్రము పట్టి, వలదనుచు ప్రార్థిస్తున్న అర్జునునితో " నేడు భీష్ముని చంపుదు నిన్ను గాతు" అంటూ ఏనుగుపైకి లంఘించు సింహము వలె తనపైకి వచ్చు ఆ దేవదేవుడే నాకుదిక్కు..." అని భక్తి పారవశ్యంతో చెప్పుకున్నాడు భీష్ముడు. గతనెలలోనే భీష్మ ఏకాదశి వచ్చింది. ఆనాడు శ్రీ సద్గురు దేవుల పాదపూజ, ఏకాహం భక్తి పూర్వకంగా జరుపుకున్నాము. జనవరిలో మాఘపౌర్ణమినాడు సత్సంగం,శ్రీ సద్గురు దేవుల పాదపూజ చేసికొన్నాము.

**సారూప్యం తవ పూజనే శివ మహాదేవేతి సంకీర్తనే**
**సామీప్యం శివభక్త ధుర్యజనతా సాంగత్య సంభాషణే**
**సాలోక్యం చ చరాచరాత్మకతను ధ్యానే భవానీపతే**
**సాయుజ్యం మమ సిద్ధమత్ర భవతి స్వామి న్కృతార్థోస్మ్యz హమ్ ॥**

"ఈశ్వరా! నీ పూజ చేయునప్పుడు నీతో సారూప్యమును. నీ సంకీర్తన సలుపునప్పుడు నీ సామీప్యమును, భక్తులతో కలసి నీ గాధలను నుతించునప్పుడు నీ సాలోక్యమును, నిన్ను ధ్యానము చేయునప్పుడు నీ సాయుజ్యమును నా కిప్పుడే ప్రసాదించుచుంటివి గాన ధన్యుడనైతిని ప్రభూ!" అని సెలవిచ్చారు శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు శివానందలహరిలో. మహాశివరాత్రి పర్వం ఈ నెల ది.12న వస్తోంది. తెల్లవారుజామున శ్రీ గురుదేవులకు శ్రీ రుద్ర నమక, చమకాలతో మహాభిషేకము, శ్రీ రామలింగే శ్వరస్వామి వారికి పంచామృతాలతో, నవరసాలతో అభిషేకము, ఆ తరువాత సహస్ర ఘటాభిషేకము, లక్షబిల్వార్చన ఆ రోజున చేసికొంటాం. ఆ రోజు రాత్రి శ్రీకాళికాపరమేశ్వరి శ్రీరామలింగేశ్వరస్వామివారల నగరోత్సవమును, వారి లీలా కళ్యాణములను కన్నుల పండుగగా చేసికొంటాం.

సాలెపురుగుకు, పాముకు, ఏనుగుకు, కన్నప్పకు మోక్షాన్ని ప్రసాదించిన భోళా శంకరుడు, శరణాగతభావంతో మనం చేసే పూజలందుకొని, మనందరిపైన తప్పక తన అనుగ్రహవర్షాన్ని కురిపించి కాపాడతాడు.

అట్టి అనన్య భక్తిని, శక్తిని, అఖండ ఐశ్వర్యమును పరశివ స్వరూపులైన శ్రీ గురుదేవులు మనకు ప్రసాదించెదరు గాక సుఖీభవ!

- మీ అమ్మ

# సంపాదకీయం

శ్రీ సద్గురు దేవుల దివ్య ఆశీస్సులతో ధనుర్మాస కార్యక్రమాలు చూత తరు ఛాయలలో భక్తి భరితంగా పూర్తి చేసుకున్నాము. ప్రతి రోజు సంకీర్తన, తిరుప్పావై ప్రవచనం, ఋషుల చరిత్రలు, భాగవత ప్రవచనంతో, సుందరకాండ పారాయణలతో, రాధాకృష్ణుల, సద్గురు దేవుల పాదపూజలతో, ప్రసాదాలతో ఆశ్రమ వాతావరణం దివ్యంగా, పవిత్రంగా అలరారింది.

ఒకవైపు ప్రజలలో భక్తి పెంపొందుతుంటే మరొకవైపు రాష్ట్రమంతా అల్లకల్లోల రాజకీయ వాతావరణంతో, హత్యలతో, ఆత్మాహుతులతో, ఆస్తుల విధ్వంసాలతో అతలాకుతలమౌతున్నది. నిత్యావసర వస్తువుల ఆకాశాన్ని అంటుతున్న ధరలు అదుపులోకి రాకపోవటం, సామాన్య ప్రజల జీవనం అనేక ఆటుపోటులకు గురికావటం, అయినా నేతల దృష్టి అన్య కార్యక్రమాలపైన కేంద్రీకరించవలసి రావటం వంటివన్నీ చూస్తుంటే మన పెద్దలు ఆధ్యాత్మికతకు అంత విలువ ఎందుకు ఇచ్చారో బాగా అర్థం అవుతున్నది.

దొంగలను దండించడానికి అనుమతి ఇవ్వమని గురుదేవులను అర్థించిన కళ్యాణ్‌తో సమర్థులు తననుతాను తెలుసుకోకుండా ఇతరులను దండించే అధికారం ఎవరిచ్చారయ్యా? అని అంటారు. ఆత్మసాక్షాత్కారాన్ని పొందనిదే ఇతరులను న్యాయంగా శిక్షించటంగాని, ఇతరులకు స్వార్థరహితంగా సాయపడటం కాని సాధ్యం కావు. త్రికరణముల మధ్య సామ్యం లేనివాడు తనను తాను ఉద్ధరించుకోలేడు. ఇక ఇతరులను ఏం ఉద్ధరించగలడు?

అందుకే జ్ఞానులు కానివారు ఇతరులకు సాయం చేయాలన్నా, వారిని దండిచాలన్నా, లోకహితం చేయాలి అనుకున్నా జ్ఞానుల సలహా తీసుకుని ఆచరిస్తే అవి ధర్మపరంగా ఉండి ఎవరికీ బాధ కలిగించకుండా సర్వులకు హితాన్ని కలిగిస్తాయి. ఆ మార్గంలో దౌర్జన్యానికి, హింసాకాండకు తావు ఉండదు.

ఆశ్రమంలో ఫిబ్రవరి 12వ తారీకున శివరాత్రి మహోత్సవం జరుగుతుంది. భక్తులందరూ తెల్లవారుజామున గురుదేవులకు జరిగే అభిషేకంలో, రామలింగేశ్వరునికి జరిగే సహస్ర ఘటాభిషేకంలో, స్వామివారి లీలా కళ్యాణంలో, ఇతర కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొని భగవత్కృపకు పాత్రులయ్యేదరు గాక. అందరికీ ఆశ్రమం తరపున ఇదే మా సాదర పూర్వక ఆహ్వానం.

శ్రీ సద్గురు దేవుల కృప వలన త్వరలో అంతటా సుఖశాంతులు నెలకొనుగాక!

- గౌరవ సంపాదకుడు

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

మహాత్ములు మనకు వెలలేని, అంతులేని పెన్నిధిని అందించారు. కాని దాన్ని మనం దుమ్ముతో, ధూళితో, రాళ్ళతో, రప్పలతో కప్పేశాం. ఇక అది ఎంత గొప్ప నిధి అయితే మాత్రం ఏం లాభం? ఆ దుమ్మును, ధూళిని, రాళ్ళను, రప్పలను తొలగించి, ఆ నిధిని వెలికితీసి ఉపయోగించుకో గలిగితే, ఇక మానవుని సుఖశాంతులకు లోటేమున్నది?



(శ్రీబాబు, తమ బోధ మధ్యలో ఆపి "ఇలారా" అని పిలిచిచారు. వెళ్ళాను. "దగ్గరకు రా" అన్నారు. దగ్గరకు వెళ్ళాను. "ఇంకా దగ్గరకు రా" అన్నారు. ఇంకా దగ్గరకు వెళ్ళాను. వీపుపై ఒక్క చరుపు చరిచి, "ఇలా నా చేతికి అందేటంత దగ్గరకు, నన్ను అందుకునేటంత దగ్గరకు నీ మనస్సు రావాలి; అంతేగాని శరీరంతో ఎంత దగ్గరకు వస్తే మాత్రం ఏం అందుకుంటావు? భగవంతుడి దగ్గరకు చేరవలసింది ఉపాధి కాదు ; మనస్సు" అన్నారు.)

అలా మన మహాత్ములు, గురువులు అందించిన హితబోధ, తత్త్వబోధ అనే పెన్నిధిని చెవులతో విని, వదిలేయటం కాకుండా, అది మనస్సుకు బాగా పట్టించుకుని దానిని ఆచరణలో ఉపయోగించుకుంటే దేశమే సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. మహాత్ములు అందరు తాము ఆచరించి ఆనందాన్ని పొందిన మార్గాన్నే మనకు చూపారు. ఆ మార్గంలోనే మనమూ పయనించి, వారి బోధను జీర్ణించుకుని, ఆచరిస్తే, ప్రతి మానవునిలోను జ్ఞానమనే జ్యోతి మరింతగా వికసిస్తుంది. దుర్భరమైన స్వార్థము, అజ్ఞానము, నీచభావాలు హరిస్తాయి. అలా ఆచరించాలంటే భగవద్ధ్యానము, గురుకృప కలగాలి. ఆ కృప వల్లనే శక్తి కలుగుతుంది. ఆ శక్తితో బుద్ధ భగవానుడు ధ్యానమార్గంలో ఉత్తీర్ణుడై మోక్షఫలాన్ని అందుకున్నాడు. తాను అందుకొన్న ఆ ముక్తిఫలాన్ని మానవ సోదరులందరికి అందించాలని మహా త్యాగ్యం చేశాడు.

బుద్ధుని వలె త్యాగం చేసినవాడే నిజమైన సన్న్యాసి. అట్టి త్యాగాన్ని ఆచరిస్తూ బోధించాలి. దివ్యజ్ఞాన ప్రబోధం చెయ్యాలి. మానవ హృదయంలోని

అజ్ఞాన తిమిరాన్ని హరించి, జ్ఞాన భాస్కర కిరణాల వెలుగుతో నింపవలె. అప్పుడు మానవుడు సత్యాసత్య వివేకము కలిగి, పాలను నీటిని వేరు చేసే శక్తిని అంటే ఏది సత్యమో ఏది అసత్యమో తెలుసుకొని, అసత్యాన్ని విసర్జించి సత్యాన్నే గ్రహించే శక్తిని పొంది పరమ హంస స్వరూపుడుగా మారగలడు. సత్యాన్నే గమనించగలడు. మంచినే చేయగలడు. వాని హృదయము సత్యము, శాంతి, దయ, ప్రేమలతో నిండిపోతుంది. అది అమృతభాండమే అవుతుంది. దానిని అందరికి అందిస్తాడు. అతని ముఖము ఎప్పుడూ వికసించిన పద్మము వలె ఉంటుంది. అట్టి దివ్యానుభూతిని తాను పొంది, అందరికి అందించాలని ఆరాటపడిన కరుణామయుడు బుద్ధభగవానుడు. ఆయన అందించిన సందేశం వల్ల, అజ్ఞానం నుండి ఉద్భవించిన సందేహాలన్నీ పటాపంచలైనాయి. ప్రపంచమంతటా, స్వార్థరహితమైన ప్రేమ, జీవకారుణ్యము, అఖండ శాంతి వెల్లివిరిశాయి.

బుద్ధునివంటి మహాత్ములు ప్రేమ, త్యాగము, స్వార్థ రాహిత్యము, భక్తి, వైరాగ్యము వంటి ఉత్తమ గుణాలను మనకు నేర్పారు. ఆ మహాత్ముల ఋణం మనం ఎలా తీర్చుకోగలము? వారి త్యాగాలకు, సేవలకు మనం ఏమి ప్రతిఫలాన్ని యివ్వగలము? అవి మనకు శాంతి సుఖాలను అందించి మనలను పవిత్రులుగా, సౌభాగ్యవంతులనుగా, శాంతి కాముకులనుగా చేస్తాయి. అటువంటి మహాత్ముడు, మహా పరాక్రమశాలి, సుగుణరాశి, సౌందర్యనిధి బుద్ధుడు. ఆయన పరాక్రమం అంతశ్శత్రువులైన కామ, క్రోధాది అరిషడ్వర్గాలను జయించగలిగింది. ఆయన సౌందర్యం ఆత్మసౌందర్యం. అది మానవ కోట్లందరి హృదయాలను చూరగొనగలిగింది. ఆయన అవతారం చాలించినా,ఆయన దివ్యనామం యీనాటికీ, ఏనాటికీ, శాశ్వతంగా, మాయకుండా నిలిచి ఉంటుంది. ఆ సత్యమే యీనాడు జగతిని పాలిస్తున్నది. ఆ ధర్మచక్రమే మనలను యీనాడు కాపాడుతున్నది. ఈనాటికీ ఆయన పూజింపబడుతున్నాడు. ఆయన సందేశము రాజ్యదాహం గలవారు, కీర్తికాముకులు అయిన రాజుల హృదయాలనే మార్చివేసింది. కనుకనే తాను సంహరించిన లక్షలాది శత్రుసైన్య మధ్యంలో ఉన్న అశోక చక్రవర్తి హృదయ పరివర్తన చెంది, ఖడ్గాన్ని పారవేసి, సత్యం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, బుద్ధం శరణం గచ్ఛామి" అని బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాడు. ఖడ్గాలతో జయించలేని అంతశ్శత్రువులను అలా బుద్ధుని శరణాగతుడైన అశోకుడు జయించగలిగాడు. అతనిలోని మహత్తర

పరివర్తనకు అద్భుతపడిన శత్రురాజులు కూడా తమ ఖడ్గాలను పారవేసి surrender అయిపోయారు. ఇక ఆ కాలంలో రాజ్య ఆక్రమణ అన్నది ఎక్కడా ఒక సెంటీమీటరు కూడా జరగలేదు. పరమశాంతి, సర్వమానవ సౌభ్రాతృత్వము అవే రాజ్యం చేశాయి.

ఏ శక్తి అలా చేయగలిగింది? "అహింసా పరమో ధర్మః" అనే వేదసూత్రంలోని మహత్తర శక్తి అది. దానిని తు.చ. తప్పకుండా ఆచరించటం ద్వారానే పరమపురుషుడైన గాంధీ మహాత్ముడు మన దేశానికి పరదేశీయుల పాలన నుంచి విముక్తిని సాధించి 1947లో స్వాతంత్ర్యాన్ని గడించ గలిగాడు. అది అధ్యాత్మ శక్తి.

"అధ్యాత్మశక్తి" లో "అ" బ్రహ్మబీజము. 'మ' అమృత బీజము. ఇవి దుష్టశక్తులను హరించి, సుఖశాంతులను ప్రసాదించి, సత్యధర్మ మార్గంలో మానవాళిని నడిపించి, ఇహంలో సమస్త భోగభాగ్యాలను, పరంలో మోక్షస్థితిని తరగని ఆనందాన్ని యిస్తాయి.

బ్రతికి ఉండగానే అటువంటి మోక్షస్థితిని మానవుడు అనుభవించాలి. అదే మీ బాబు ఆదేశము. అందుకే మీ హృదయ బాబు కృషి. అటువంటి సౌభాగ్యాన్ని మీరు పొందితే సంతోషిస్తాడు మీ హృదయబాబు. తన కుమారుడు సౌభాగ్యవంతుడైతే, ఏ తండ్రి సంతోషించడు? ప్రపంచంలోని తల్లితండ్రులకే యింత ప్రేమ ఉంటే, మరి జగత్పిత అయిన ఆ పరమాత్మకు యింకెంత ప్రేమ ఉండాలి? ఆయన యింకెంత సంతోషిస్తాడు? ఆ పరమాత్ముని దయను మనం యీ జన్మలోనే సాధించాలి. అప్పుడే మన మనస్సులోని కలుషము హరిస్తుంది. సంసార సాగరాన్ని అవలీలగా దాటే శక్తిని మనకు ప్రసాదించేది ఆ పరమాత్ముని అవ్యాజ ప్రేమ ఒకటే. ఆ ప్రేమను పొందగలిగిననాడు సుఖశాంతులు మన సొత్తు.

ఈ ప్రాపంచిక ప్రేమలు, యీ భోగభాగ్యాలు అశాశ్వతములైనవి. నమ్మరానివి. మూర్ఖులైన మానవులు వాటిని నమ్ముకుని దుఃఖానికి గురి అవుతున్నారు గాని నమ్మవలసిన దానిని నమ్మటం లేదు. అది రూపనామ క్రియారహితమైన పరమాత్మ వస్తువు. దానిని నమ్మి ఆశ్రయించండి. లక్షల కోసం ప్రాకులాడటం వల్ల ఏమి సుఖం? సంపాదించలేకపోతే దుఃఖము; దోచుకుందామని వేచి ఉండే దాయాదుల వల్ల, బంధువుల వల్ల దుఃఖము; income tax వాళ్ళ వల్ల దుఃఖము, ఇంట్లో వాళ్ళ వల్ల దుఃఖము. ఇక సుఖమెక్కడిది?

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి) -జపమాల ప్రసాద్

ఈ పిల్లలలో ఎంతమంది వివేకానందులు, ఎంతమంది గాంధీమహాత్ములు వంటి మహానుభావులు దాగి వున్నారో! ఒక్కొక్క బాలుడు, ఒక్కక్క బాలిక ఒక్కొక మహాత్ముడుగా రూపొందాలి. అలాంటి మహానుభావుల వలె అవ్వాలంటే, వారే బాటలో నడిచారో, మీరూ ఆ విధంగా నడుచుకోవాలి. పెద్దలయందు, అధ్యాపకులయందు వినయ భయభక్తులు కలిగి వుండాలి. అధ్యాపకులందరూ మీకు ఎంతో శ్రమించి, శ్రద్ధగా పాఠాలు చెపుతున్నారు.



'మాతృదేవోభ! పితృదేవోభవ! ఆచార్య దేవోభవ! అతిథి దేవోభవ!' అని వేదమాత శాసిస్తోంది.

పెద్దలయందు వినయ విధేయతలు కలిగి వుండాలి. తల్లిదండ్రుల సేవని మించిన సేవ లేదు. ప్రత్యక్ష పార్వతీపరమేశ్వరులైన తల్లిదండ్రులని సేవించుకోకుండా, వారిని చిన్నచూపు చూసి, గుళ్ళోకి వెళ్ళి దేవుళ్ళకు ఎన్ని దణ్ణాలు పెట్టినా అవి వృథాయే. అందుకే "ధర్మో రక్షతి రక్షితః" అన్నారు. మనం ధర్మాన్ని చక్కగా కాపాడుకుంటే, అది మనలని రక్షిస్తుంది.

**యా కుందేందు తుషార హార ధవళా యా శుభ్రవస్త్రాన్వితా**
**యా వీణా వరదండ మండిత కరా యా శ్వేత పద్మాసనా**
**యా బ్రహ్మాచ్యుత శంకరః ప్రభుతిభిః దేవైః సదాపూజితా**
**సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా ॥**

అని సరస్వతీమాతని స్తుతిస్తున్నాం.

చక్కటి లేత దానిమ్మగింజలు, పూర్ణచంద్రకాంతి లాగ, మంచులాగా, ధవళ (తెల్లటి) కాంతులతో మెరయుచున్న హారాలు, శుభ్రధవళ (తెల్లటి) వస్త్రాలు ధరించి, తెల్లటి తామరపుష్పమును ఆసనంగా చేసికొని కూర్చుని, వీణను మీటుతూ వున్న ఆ సరస్వతీమాత, బ్రహ్మ, ఈశ్వరుడు యిత్యాది దేవతలందరి చేత సదా పూజింపబడు తోంది. అటువంటి భగవతియైన

సరస్వతి, మాయొక్క అజ్ఞానమనే జాడ్యాన్ని (జబ్బుని) రూపుమాపి, రక్షించుగాక! అని ఆ ప్రార్థనా శ్లోకానికి అర్థం. కళల తల్లియైన ఆ సరస్వతీ దేవి యొక్క శక్తి యీ బిడ్డలందరిలోనూ ప్రకాశిస్తోంది. ఈ బిడ్డల మట్టుకే కాదు, పిపీలి కాది బ్రహ్మపర్యంతం అదే శక్తి ప్రకాశిస్తోంది. "యా దేవీ సర్వభూతేషు శ్రద్ధా రూపేణ సంస్థితా। నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః" - ఏ దేవి అయితే సర్వ భూతముల యందు శ్రద్ధా రూపంలో ఉన్నదో, ఆ దేవికి నమస్కరిస్తున్నాను అని దేవీసూక్తం చెపుతోంది మనకి - ఇది ఒక మహా మంత్రం.

పెద్దలు మంచిని ఆచరించి, పిల్లలకి మార్గదర్శకులవ్వాలి. ఈర్ష్య, అసూయ, ఓర్వలేనితనం, కామ, క్రోధ, మద, లోభాది గుణాలన్నీ రహితం అవ్వాలి. ఈనాటి బాలలే, రేపటి పౌరులు. మంచితనము, సత్యము వంటి సద్గుణాలని ఎంతవరకూ నిలుపుకో గలుగుతున్నామని ఎవరికి వారే తరచి చూచుకోవాలి.

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః। గురుర్దేవో మహేశ్వరః।**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ। తస్మై శ్రీగురవేనమః॥**

అనే శ్లోకంతోటే, మన భారతీయ సాంప్రదాయంలో విద్యాభ్యాసం మొదలవుతుంది. కనుక అధ్యాపకులే అక్కడ మనకి గురువులవుతున్నారు.

"యా = ఏది, విత్ = తెలుసుకుంటే - ఇక తెలుసుకోవలసినది లేదో - అది అసలైన విద్య" అని 'విద్య' అనే పదానికి అర్థం. అటువంటి విద్య అధ్యాత్మవిద్య. అది మనకి అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది. **"త్యాగేనైకే అమృతత్వమానశుః"** అని శృతివాక్యం. త్యాగం ఒక్కటి ద్వారానే అమృతత్వాన్ని పొందగలం - కనుక మనకి వున్నంతలో యింకొకరికి పెట్టాలి. ఇది మనం పిల్లలకి చిన్నతనం నుండీ నేర్పించాలి.

గాంధీమహాత్ముడు, ఒక చెంపమీద కొడితే, రెండో చెంప చూపెట్టమన్నారు. అటువంటి సహనగుణం అలవరచుకోవాలి. కెన్నడీ, నెహ్రూ యిత్యాది నాయకులు ఎంతటి సంఘసేవ చేశారు! " నాదేశానికి నేను ఏ విధంగా సేవ చేసుకోగలను? దేశం నాకేమిచ్చిందని కాదు - దేశానికి నేను ఎంత ఈయ గలుగుతున్నాను?" అని అమెరికా దేశాన్నేలిన కెన్నడీ మహాశయుడు ఎప్పుడూ అనుకుంటూవుండేవారని, గురుమహరాజ్ శ్రీబాబూజీ చెప్పేవారు. మరి

ఈనాడు పరిస్థితి ఎలావుంది? "దేశం నాకు ఎంత గౌరవం ఇస్తోంది? నాకు ఎన్ని కార్లుంటాయి? నాచేతి క్రింద ఎంతమంది వుంటారు?" అనేది యిప్పటి కాలంవారి ఆలోచన. అదేవిధంగా నిజమైన భక్తుడు "నాకు భగవంతుడు ఏమిస్తాడు?" అని చూడడు; "భగవంతుడికి నేనేమి యిచ్చుకోగలను?" అని ఆలోచిస్తాడు. శ్రీకృష్ణుడు కనిపించగానే, "నీ పాదకమల సేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యమును, నితాంత అపార భూతదయయును తాపసమందార నాకు దయసేయగదే" అని కోరుకున్నాడు సుదాముడు. ఆ భగవంతుడి కరుణ అపారమైనది. విశ్వప్రేమను చిన్న పిల్లలకి నేర్పించాలి. సుమతీశతకం యిత్యాది చక్కటి నీతిని ప్రబోధించే పద్యరత్నాలు మన తెలుగులో ఎన్నో వున్నాయి. అటువంటి నీతి మాటలను పిల్లలకు నేర్పిస్తూ, వారిని మంచి మార్గంలో నడిపించాలి. క్రోధమనే గుణం మానవుడిని నాశనం చేసేస్తుంది కనుక, దానిని ఏమాత్రం దరికి రానీయకూడదు. దీనికి మీకొక చిన్నకథ చెపుతాను.

పూర్వం ద్వాపరయుగంలో ఒకనాడు శ్రీకృష్ణపరమాత్మ, బలరాముడు, సాత్యకి కలసి వ్యాహ్యాళికని (షికారు) వెళ్ళారట. చీకటి పడిపోవడంతో దారి కనిపించక, ఆ రాత్రి వారు ముగ్గురూ ఆ అడవిలోనే వుండిపోవలసివచ్చింది. అప్పుడు కృష్ణుడి సూచన మేరకు, రాత్రి మూడు జాములకి, వంతులువారీగా వారి ముగ్గురిలో ఇద్దరు పడుకుంటే, మూడవవారు కాపలా కాసేటట్టుగా ఒడంబడిక కుదురుతుంది.

రాత్రి మొదటి జాము, కృష్ణ బలరాములు పడుకుని వుండగా, సాత్యకి కాపలా కాస్తున్న సమయంలో ఒక రాక్షసుడు వస్తాడు. వాడిని చూసి, సాత్యకి క్రోధంతో వాడిని చంపుదామని వెళ్ళేసరికి, ఆ రాక్షసుడు పెద్దగా పెరగడం ప్రారంభిస్తాడు. సాత్యకి మరింత క్రోధంతో ముందుకు వెళ్తే, వాడు మరింత పెరగడం, యీ విధంగా ఆ జామంతా జరిగి జరిగి ఆ రాక్షసుడి చేత బాగా దెబ్బలు తిని, చివరికి సాత్యకి నీరసించి, చతికిలబడిపోతాడు. ఆ తరువాత బలరాముడు వంతు కాపలా. అతడు కూడా ఆ రాక్షసుడిని చూసి, క్రోధంతో చంపబూనేసరికి, వాడదే విధంగా పెరిగి బలరాముడిని హింసిస్తాడు. చివరికి బలరాముడు కూడా కృష్ణుణ్ణి లేపి చతికిలబడిపోతాడు.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గతసంచిక తరువాయి)

- పరాశర ప్రసాద్

మీకో చిన్న దృష్టాంతం చెబుతాను. ఉదాహరణకి మీకో చిన్న బాధ్యత అప్పజెప్పాను అనుకోండి. అందులో ఉండే మంచి చెడులు మీరే చూసుకోవాలి. ప్రతి చిన్న విషయానికి నన్ను సంప్రదించనవసరం లేదు. అయితే బాబుగారిని అడగందే ఏ పనైనా ఎలా చేస్తామండీ? అనుకొని ప్రతిచిన్న విషయం నన్ను అడగటం వలన ప్రమాదవశాత్తు అందులో ఏదైనా లోటు జరిగితే బాబుగారే ఇలా చేయమన్నారు, చేశాం. ఇలా అయిందేమిటి? మరి బాబుగారు ఇలా ఎందుకు చెప్పారు? అని సంశయం కలగవచ్చు. అప్పుడు నీ విశ్వాసం ఏమౌతుందో ఆలోచించు. చిల్లుకుండ అవుతుంది. అలా కాకుండా శ్రద్ధతో గురుదేవునికి నమస్కరించి ఏ పనైనా చేశారనుకోండి అది సక్రమంగా నిర్వహించబడుతుంది. నీలో శ్రద్ధ లోపించింది అనుకో, ఏ విషయం గురు దేవుణ్ణి అడగాలో, ఏ విషయం అడగకూడదో విచక్షణా శక్తిని కోల్పోతావు.

ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను. నీ ముఖం తుడుచు కోవటానికి ఒక రకం, ఒంటికొక రకం, డైనింగ్ టేబుల్ క్లీనింగ్‌కి ఒక రకం క్లాత్‌ని వినియోగిస్తారు కదా! అన్నింటికి ఒకే రకం ఉపయోగించరు కదా? వెధవది మీరు ఉపయోగించే క్లాత్ విషయంలోనే అంత శ్రద్ధ తీసుకుంటే ఇక గురుదేవుని విషయంలో ఎలా ఉండాలి? ఆయన సాక్షాత్తు త్రిమూర్తి స్వరూపుడు అని తెలుసుకదా. అటువంటి గురుమూర్తిని మీ కుటుంబ సమస్యలతోనూ, వ్యక్తిగత సమస్యలతోనూ వేధించి ఆయన విలువైన కాలాన్ని దుర్వినియోగ పరిస్తే నష్టపోయేది ఎవరు? చదువుకున్నవారు ఆ విషయాన్ని ఎవరైనా గ్రహిస్తున్నారా?' అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ మామిడికాయ పచ్చిగా ఉన్నప్పుడు పుల్లగా ఉంటుంది. చెట్టును గట్టిగా పట్టుకుని ఉంటుంది. అలాగే మానవుడు పులుపు అనే అహంకార స్వభావం కలిగిఉండి, సంసార వృక్షాన్ని గట్టిగా పట్టుకొని ఉంటాడు. కాని మామిడిపండు ఉదయించిన సూర్యబింబము వలె ఆకర్షవంతంగా ఉండి చక్కని సుగంధాన్ని నాసికేంద్రియం ద్వారా మనస్సుకు అందజేసి ఆనందాన్ని ఇస్తుంది. రుచికి మధురంగా ఉంటుంది. అలాగే

మానవుడు సాధన ఫలించిన కొద్దీ పక్వస్థితికి చేరి అతనిలోని కామ, క్రోధాది గుణాలు శాంతించి ఆనందాన్ని పొందుతాడు అని నేను బోధిస్తుంటే బాబుగారు కోపంగా ఉన్నారు అని అభాండాలు వేస్తారు. అటువంటి వాళ్ళంతా నన్ను మళ్ళీ మామిడికాయను చేస్తున్నారు. మామిడిపండు ఎప్పుడైనా మళ్ళీ మామిడికాయ అవుతుందాండీ? అని ప్రశ్నించారు.

భగవంతుడిని మీరు ఏమీ కోరనవసరం లేదు. ఆయనఏమీ తెలివి తక్కువవాడు కాదు. మీరు విశ్వాసం పెంపొందించుకొన్న కొలదీ ఆయన దయను పొందగలుగుతారు. గంపెడు కోర్కెలతో భగవాన్నుణ్ణి సేవించి, ఒక్క టెంకాయ కొట్టి మొక్కుదీర్చుకొనేవారు కొందరు. అవసరం తీరేవరకు భక్తిని ప్రదర్శించేవారు అవసరార్థ భక్తులు. కొంతమంది వంగి వంగి సలాములు చేస్తూ అతి వినయంగా తామరాకుమీద నీటి బిందువు ముత్యంలా ఎలా ప్రకాశిస్తుందో అలా భక్తునివలె నటిస్తారు. వారే కపట భక్తులు. ఇవన్నీ తెలిసికోలేని తెలివితక్కువ వాడా భగవంతుడు? ఆయన అన్నీ తెలిసినవాడు. గురువు ఇచ్చిన లక్ష్యార్థం మరిచి, గురువాక్య పాలన చేయక, భగవానుని కరుణాకటాక్షానికి దూరమై, ఇవన్నీ నిర్వహించటానికి కావలసిన బుద్ధిని ఆయన ఎందుకు కలిగించలేదు? అని భగవంతుణ్ణి నిందిస్తే ఆయన ఏం చేస్తాడు? అని శ్రీబాబు ప్రశ్నించారు. ముఖం పద్మదళాకారం వర్చస్సు చందన శీతలం కాని వాడి హృదయం మాత్రం కత్తులబోను. అవి మంగలి కత్తులకన్న పదునుగా ఉంటాయి. అందుచేతనే అతి వినయం ధూర్త లక్షణం.

**11-3-1985**

ఈ రోజు రాత్రి శ్రీబాబు దర్శనార్థం రావుగారు ఆయన శిష్యులు అనంతం, శేషగిరిరావు వచ్చారు. రావుగారు బాబుకి నమస్కరిస్తూ 'ఈ రోజు నేను సముద్రంలో దూకి తనువు చాలిద్దామనుకున్నాను' అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ సంసార సాగరాన్ని వదిలి సాగరాన్ని చేరదామనుకున్నారా. ఇంకేం అంతకన్న కావలసినదేమున్నది. అంతపని మీరు చేయగలరా? సంసార సాగరాన్ని వదలటం అంత తేలికా? అలా వదిలి సముద్రంలో పడితే కావలసినది ఏమున్నది? సాగరము శ్రీమన్నారాయణ మూర్తి ఉండే స్థానము. పాలకడలిలో శేషశయనుడై ఉన్న ఆదినారాయణ మూర్తి స్పర్శతో సమస్త పాతకములు హరించిపోతాయి. సాగరాన్ని చేరగానే మీరు

మారిపోయేవారు. మీలో దుర్గుణాలు సుగుణాలుగా మారిపోయేవి అన్నారు.

శ్రీరావుగారు మాట్లాడుతూ ఈ రోజు మా ఆవిడ నన్ను వెధవకుంక అని అనేక దుర్భాషలాడింది అన్నారు. శ్రీబాబు కలుగజేసుకుని 'మీరు ఏమీ దూషించకుండా ఆవిడ మిమ్మల్ని దూషించిందంటే నేను నమ్మను' అన్నారు. రావుగారు మాట్లాడుతూ మీరు ఎలాగైనా స్త్రీ పక్షపాతి అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ 'నాది అభేద దృష్టి. నా దృష్టిలో స్త్రీ అయినా పురుషుడైనా ఒకటే. అయినా మీరు స్త్రీ అని సంబోధించారు కాబట్టి అందులో శ్రీ అనే శబ్దం ఉంది కాబట్టి, శ్రీ అంటే మంగళస్వరూపం కాబట్టి నేను శుభాన్నే కోరుకోవటంలో తప్పేమున్నది? చెప్పండి' అన్నారు. శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ 'మీ భార్యాభర్తలిద్దరూ ప్రసంగం చేసినప్పుడు మీ అమ్మాయి సాక్ష్యం ఉంది అడుగుదాం' అన్నారు.

రావుగారు మాట్లాడుతూ నా భార్య ఒక పెద్ద రాక్షసి, దాని కూతురు చిన్న రాక్షసి కాబట్టి అది వాళ్ళ అమ్మవైపే మాట్లాడుతుంది అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ 'మీరు శాంత స్వరూపులైతే మీ నోటి వెంట అటువంటి ప్రసంగం ఎందుకు వచ్చింది? నేను అమాయకుణ్ణి కాబట్టి మీరు ఇలా మాట్లాడుతున్నారు. అయినా మీరు చేయవలసినది గుణత్యాగం కాని దేహత్యాగం కాదు' అన్నారు.

రావుగారు కల్పించుకొని మీరు నిజంగా అమాయకులే. ఎందువల్ల అంటే మాయని కమ్మించేవారు కాబట్టి అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ 'అనంతం అమాయకులు అంటే అర్థం ఏమిటి?' అని అడిగారు. అమాయకుడు అంటే innocent మాయ తెలియనివాడు అని అర్థం అన్నాడు అనంతం. శ్రీబాబు కలుగజేసుకుని శేషగిరిరావుగారిని ప్రశ్నిస్తూ 'మీరు పండితులు కదా! అమాయకులు అంటే అర్థం ఏమిటండీ?' అన్నారు. ఆయన మాట్లాడుతూ అమాయకుడు అంటే మాయని కమ్మించేవాడు అని అర్థం అని చెప్పారు. శ్రీబాబు మాట్లాడుతూ 'మాయ అంటే ఏమిటి? ఏది లేదో అదే మాయ' అన్నారు. జీవాత్మ అంటే ఏమిటి అని ప్రశ్నించారు శ్రీబాబు. రావుగారు సమాధానం చెబుతూ పరమాత్మని మాయ కమ్మితే జీవాత్మ అవుతాడు అన్నారు.

-సశేషం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**ఫిబ్రవరి 2010**

8 సోమ శ్రీగురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ.

12 శుక్ర మహా శివరాత్రి, తె.ఝా. 3 గం.లకు బృందావనంలో శ్రీ గురుదేవులకు రుద్ర,నమక, చమక సహితంగా అభిషేకం 4 గం.లకు మహన్యాసము, 5గం.30 నిలకు శ్రీ సద్గురు పాదపూజ, 7గం.30 నిలకు సామూహిక రుద్రాభిషేకములు, 11గం.లనుండి శ్రీ రామలింగేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన, రాత్రి 6.గం. 30ని.లకు శ్రీ మహాకాళికాపరమేశ్వరీ రామలింగేశ్వరుల నగరోత్సవము రాత్రి7గం.30ని.లకు లీలా కళ్యాణము.

17 బుధ శ్రీ లలితానంద సరస్వతి స్వామినివారి పుణ్యారాధన మహోత్సవము,శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, ఆరాధన కార్యక్రమము.

28 ఆది పూర్ణిమ, హోలీ, శ్రీ సద్గురు పాదపూజ.

**మార్చి 2010**

10 బుధ శ్రీ గురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ.

13 శని శనిత్రయోదశి.

14 ఆది మాసశివరాత్రి.

16 మంగ శ్రీ వికృతినామ సంవత్సర ఉగాది, పంచాంగ శ్రవణము, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

గమనిక ది.18.1.2010 నుండి ది.20.1.2010 వరకు చిన మంగళాపురంలో, ది. 22.1.2010 నుండి ది.26.1.2010 వరకు భాగ్యనగర శాఖా భవనంలో జరగవలసిన సత్సంగ కార్యక్రమములకు, అనివార్య కారణములవల్ల నిరవధికంగా వాయిదా పడింది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాము. -ఎడిటర్

మార్చి 1,2,3 తేదిలు (సోమ, మంగళ, బుధవారములలో) శ్రీ అష్టలక్ష్మి పీఠము(తెనాలి) 12 సంవత్సరములు పూర్తి అయిన శుభ సందర్భమున **మౌక్తికోత్సవము మరియు మహాకుంభాభిషేకము, అన్న సంతర్పణ** మొదలగు కార్యక్రమములు శ్రీ దండి స్వాములవారి (శ్రీ అష్టలక్ష్మి పీఠము) ఆధ్వర్యమున, పూజ్య యోగినీ శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీవారి నిర్వహణలో, శ్రీ కొత్త సుబ్రహ్మణ్యంగారి (కుమార్ పంప్స్) పర్యవేక్షణలో జరుగుతాయి.

# సత్సంగ సౌరభం

-శివ ప్రసాద్

ఆకాశం వచ్చేసరికి వ్యాప్తి వస్తుంది. వ్యాప్తి పూర్వం కూడ ఉన్నది. కాని అది ఇంద్రియ గోచరం అయ్యేది కాదు. ఆకారం ఉంటే ఇంద్రియాల ద్వారా తెలుసుకొనే సరికి మూలాన్ని మరచి ఎదురుగా ఉండేదాన్ని పట్టుకుంటున్నారు. ఇంద్రియాల ద్వారా కనిపించేది మాత్రమే సత్యం అనుకోకుండా, దానికొక మూలం అనేది ఉన్నది, అది సత్యము అని గ్రహించటానికి మనుష్యులకే అవకాశం ఉన్నది. దేవతలు కూడ మనుష్యులే, ఎక్కువ పుణ్యం చేసుకున్నవారు దేవతలు అవుతారు. ఆ గొప్పతనాన్ని దేవతలు కూడ తెలిసికోలేక మనుష్యులకన్న ఎక్కువ అవస్థపడుతున్నారు. మనస్సు ఉంటుంది. సూక్ష్మేంద్రియాలు ఉన్నై. ద్వంద్వాలు ఉన్నై. కష్టసుఖాలు ఉన్నై. శరీరము, ఇంద్రియాలు, మనస్సు ఉన్నప్పుడు అన్నీ ఉంటై. అజ్ఞానం ఆవరిస్తుంది. భ్రాంతిలో పడి సత్యాన్ని మరుస్తారు. అందుచేత ఒక్కొక్కప్పుడు దేవతలకంటే మనుష్యులే గొప్పవాళ్ళేమో అనే భావన కలుగుతుంది. వివేకం, జ్ఞానం, ధర్మ ప్రవర్తన ఉంటేనే మానవుడు పశువు కంటే గొప్ప. ఎంత చదువు ఉన్నా, ఎంత పాండిత్యం ఉన్నా, బ్రహ్మ సూత్రాలు చదివి అర్థం చేసుకొని, ఉపన్యాసాలు చెప్పినా, పశువుల కంటే విశేషం ఏమీలేకపోవటం చేత, ఇంద్రియాలతో అనుభవించేదే సుఖము అనే భావన ఉన్నంత వరకు, పశువు కంటె భేదం లేదు. దీనికన్న ఇంకొక ముఖ్యమైనది ఉన్నది, అదినా స్వరూపము అని తెలుసుకున్నప్పుడే పశుత్వాన్ని దాటుతారు. పశుపతి ఉన్నాడు. ఆయన ఆ పరిమితి లేకుండా ఆత్మస్థితిలో ఉంటాడు. పరిమితిలో ఉన్నట్లు చేస్తున్నా, ఆ ఇంద్రియాలను, మనస్సును తన అధీనంలో ఉంచుకుంటాడు. మనుష్యత్వం సంపాదించాలంటే, మనస్సుతో సహా ఇంద్రియాలను స్వాధీనం చేసుకోవాలి.

శంకర భగవత్పాదులవారు జంతూనామ్ నరజన్మ దుర్లభం అన్నారు. ఆ జంతువులతో ఇది కూడ ఒక జంతువే. కాకపోతే నరపశువు. ఆ నరపశువు మనుష్యుడు కావాలి. ఎందుకంటే ఈ నరుడికే నారాయణుడు కావటానికి అవకాశం ఉన్నది. నర నారాయణ అవుతుంది. అందులో ఒక వృద్ధి ఉన్నది. ఆ వృద్ధి జ్ఞాన వృద్ధి. తెలివి లేని చీమ కూడ బెల్లం ముక్క పెడితే దానిని పట్టుకుంటుంది. కాని దానికి విశేషమైన విచారణ లేదు. విచారణ చేసి, శాశ్వతము,

అశాశ్వతము అనే విచారణ చేస్తే, మనుష్య జన్మ సార్థకం అవుతుంది. అలా ప్రయత్నం చెయ్యటమే ముముక్షత్వము. బంధనను, లేదా బాధను శాశ్వతంగా లేకుండా చేసికోవటం. ఎక్కడ ఉన్నా సుఖంగా, శాంతిగా ఉండే స్థితి. అందరూ చేరుకొనే స్థితి అదే. వాళ్ళకు ఉన్న పరిస్థితులలో ఎలా ఉండగలమా అని చూస్తారు గాని, వీటిని అధిగమించిన స్థితి ఒకటి ఉన్నది అని నరపశువులకు తెలియదు. మనుష్యుడు ఒక మహాత్ముణ్ణి ఆశ్రయించాలి. గురుమేవ అభిగఛ్ఛేత్. ఆ గురువు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయి ఉండాలి. శ్రోత్రియుడు అంటే జ్ఞానం ఉన్నవాడు. జ్ఞానం చాలమందికి ఉంటుంది, కాని నిలవదు. జ్ఞాన నిష్ఠుడు కావాలి. నిష్ఠుడు అంటే, నిరంతరం ఉండేవాడు. స్థ గతినివృత్తౌ. అంటే స్థిరంగా ఉంటుంది, ప్రవృత్తి అంటే ఉండేది. నివృత్తి అంటే లేకుండా పోయేది. గతి అంటే పోయేది. స్థితి అంటే కదలకుండా ఉండటం. నిష్ఠ అంటే నిరంతరం అధవానియమేనవా. నిరంతర స్థితికి వేళ్ళేవరకు నిష్ఠగా సాధన చెయ్యాలి. రోజూ రెండు,మూడు గంటలు నియమబద్ధంగా అభ్యాసం చేస్తే నిరంతర స్థితి కలుగుతుంది. అభ్యాసం అంటే తత్రస్థితౌ అభ్యాసం. అభి, అస్ అంటే అంతటా ఉండటం అని. ఆ స్థితిలో ఉండటానికి చేసే ప్రయత్నానికి అభ్యాసం అని పేరు. శబ్దాన్ని విడదీసి విచారణ దృష్టితో చూడటం లేదు. అందువలన సరిగ్గా తెలుసుకోరు. తెలిసిన వాడి దగ్గర తెలుసుకోవాలి. అందుకు తెలిసిన వాణ్ణి ఆశ్రయించాలి. బ్రహ్మరూపము నందు, బ్రహ్మస్థితియందు తాను నిరంతర స్థితిని కలిగి ఉండాలి. బ్రహ్మము అంటే సర్వ వ్యాపకమైనది. అటువంటి స్థితిని పొందాలి. స్థితికి ముందుగతి ఉంటుంది. ఆ గతి తరువాత స్థితి ఉంటుంది. మనం బయలుదేరి కాశీకి ప్రయాణం చేయటం గతి. కాశీ చేరిన తరువాత ఉండేది స్థితి. మొదట జడత్వం ఉంటుంది. అది స్థితి కాదు. తమో గుణంలోనుండి రజోగుణం రావాలి. అందుకే పని చెయ్యాలి. do do. నిద్రపోకుండా ఎలా? నువ్వు అలసిపోతే కాసేపు విశ్రాంతి కోసం నిద్ర. నిద్ర ఎక్కువ కాకూడదు. మితనిద్ర. ఆ నిద్ర పెద్ద నిద్ర అయితే పనికి రాదు. అందుచేతనే భీష్ముడు నిద్రను సర్వాత్మనా త్యజించాలి అని చెప్పాడు. నిద్రను అన్ని విధాల వదలి పెట్టాలి. బలవంతంగా కాదు. సాధన చేసి క్రమంగా వదలి పెట్టాలి. ఆ సాధన అనుభవజ్ఞుణ్ణి ఆశ్రయించి చెయ్యాలి. అనుభవం లేని శాస్త్రజ్ఞుణ్ణి ఆశ్రయిస్తే, వాడూ గుడ్డివాడు, వీడూ గుడ్డివాడు, ఇద్దరూ గోతిలో పడతారు.

-సశేషం

# సంత్ నామదేవ్ చరితామృతం

(గతసంచిక తరువాయి) -మనోజ్ కుమార్

నామదేవుడు హృదయం ఉప్పొంగి మాటలు రాకపోతుంటే! హే గురుమాతే! అని మాత్రం అనగలిగాడు.

**విసో -** గుర్తించావా నామదేవా! నేను విసోబాఖేచరిని. ఒకప్పుడు నాకు కూడ శ్రేష్ఠ బ్రాహ్మణ్ణి అన్న అహంకారం మితిమీరి అదుపు తప్పి ఉండేది. గురుదేవులైన జ్ఞానదేవుల కరుణ వలన అది నశించింది. సోపానదేవుడు జ్ఞానమార్గం అనేపాయసం తినిపించాడు. అప్పుడు నా భ్రమ, భ్రాంతులు అన్నీ నన్ను విడిచిపెట్టాయి. గురుకృప చేయలేనిది ఏమున్నది? దేవుడి రూపాన్ని, గుణగణాలను ఎంత వర్ణించినా నిరాకార నిర్గుణ బ్రహ్మానుభూతి ఒక్క జ్ఞానం వలన తప్ప మరి దేనివలనా కలుగదు. నిన్ను నీవు గుర్తించు. నీలోని 'నీవు' ను దర్శిస్తే అప్పుడు నీవే తత్త్వతః అంతటా నిండి ఉన్న పరమేశ్వరుడివి అన్న సత్యం అనుభవానికి వస్తుంది.

**నామ -** గురుమహరాజ్! ఇక మీరు మీ నిజ రూపం చూపి దారితప్పిన ఈ శిష్యుణ్ణి అనుగ్రహించండి.

**విసో -** (చిరునవ్వు నవ్వుతూ) నీవు దారి తప్పలేదు నామదేవా! సరైన దారికే వచ్చావు. నీవు నడచిన దారిలో నేను నీకు ఎన్నో సార్లు తారసపడ్డాను. కాని నీవే నన్ను గుర్తించలేదు.

**నామ -** ఇప్పుడు అంతా గుర్తుకు వస్తున్నది. గురుదేవా! మీరే వాసుదేవ్, మీరే జగన్మిత్ర, మీరే ఆ గోసావి, మీరే ఆ పూజారి, మీరే ఇప్పుడు కుష్ఠరోగిగా దర్శనం ఇస్తున్న ఆ పరబ్రహ్మము. దయచేసి మీ సత్య స్వరూపదర్శన అనుభూతిని ప్రసాదించి నన్ను కృతార్థుణ్ణి చేయండి.

అప్పటి వరకు కలతపెడుతూ ఉన్న బాధలు, వ్యథ శల్యంలా బాధిస్తున్న సందేహాలు అన్నీ హరించి నామదేవుడికి ఇప్పుడెంతో శాంతిగా, తృప్తిగా ఉంది. శ్రీగురుకృపామృతం ద్వారా తన గురుదర్శన లాలస అనే తృష్ణ తీరి అధ్యాత్మ మార్గంలో వడిదుడుకులు, అపార్థాలు అన్నీ తొలగి, దివ్యజ్ఞానం కలిగి, ఎనలేని శాంతిని, తృప్తిని అనుభవిస్తూ నామదేవుడు గుడి బయటకు వచ్చి తిన్నగా మఠంలోకి వెళ్ళాడు.

ఊరి చివర ఉన్న కనకేశ్వరి మందిరంలో విసోబా నామదేవుడిని శిష్యునిగా స్వీకరించి, లక్ష్యార్థమును ప్రసాదించి ఉపదేశం చేశారు. నామదేవా!

నీ మనస్సును చక్కగా పరిశీలించు. సుఖము, శాంతి అనే నిధులు అక్కడే నిక్షిప్తమై ఉన్నాయి.

ప్రతి విషయాన్నీ వివేక దృష్టితో పరిశీలించు. అన్నిటికీ ఆధారమైన ఆత్మ నీవే అని తెలుస్తుంది. 'నేను', 'నాది' అన్నవి నశిస్తేగాని ఆత్మారాముడు దర్శనం ఇవ్వడు. ఇన్ని రోజులు విఠలుడు అంతటా నిండి ఉన్నాడు అని కేవలం అనుకుంటూ వచ్చావే కాని నీకు ఆ అనుభవం ఇంత వరకూ కలగలేదు. ఈనాడు ఆ అపరోక్షానుభూతితో ఇంటికి వెళ్ళు. ఆ భక్తి ధనం అందరికీ పంచిపెట్టు. నీ కీర్తనలలో ఇంక అద్వైతం నింపి ప్రచారం చేయి. నాయనా! మొదటగా నీ నామ మాహాత్మ్యాన్ని అద్వైతంతో జోడించి ఇక్కడే ఔంఢ్యా నాగనాథ్ శివుడి ముందు సంకీర్తనం చెయ్యి. వారికి శివుడియొక్క పరతత్త్వ స్వరూపం తెలియచెయ్యి. ఇదే నేను నీ నుంచి కోరే గురుదక్షిణ. జ్ఞానదేవుల జ్ఞానకళ నీ భక్తి కళకు తోడై నీకార్యాన్ని సఫలీకృతం చేయుగాక! అంటూ విఠోబా తన వరద హస్తమును నామదేవుని శిరస్సుపై ఉంచి హస్త మస్తక సంయోగం చేసి దీవించారు.

ఔంఢ్యా నాగనాథ్ మందిరంలో నుండి రుద్రనమకం వినిపిస్తున్నది. శైవాచార్యులైన నీలకంఠశాస్త్రి చేయదలచిన మహారుద్ర యాగానికి త్ర్యంబకేశ్వరం నుండి బాళంభట్టు, నాసిక్‌నుండి కాశీనాథ్ శాస్త్రి, ఘృష్ణేశ్వర్ నుండి నాగదేవాచార్యులు, విజయనగరం అయ్యాస్వామివంటి శివ సంప్రదాయాచార్యులు వేంచేసి ఉన్నారు. శృంగేరీ మహాసంస్థానం వారు కూడ యజ్ఞంలో పాల్గొనటానికి వచ్చారు. నీలకంఠశాస్త్రిగారి శిష్యులు ఉచ్చైస్స్వరంతో **నమశ్శివాభ్యాం నవయౌవనాభ్యాం........** అని ఉమామహేశ్వర స్తోత్రం అందుకున్నారు. **ఏకాచమే, త్రిస్రశ్చమే, పంచచమే** అని చమకంలోని చివరి ఆవర్తంలోని మంత్రాలు ఒడలినిండా విభూతి పూతలతో అలంకరించుకున్న, నీలకంఠశాస్త్రిగారికి కర్ణపేయంగా వినిపిస్తున్నాయి. అంతలో మహాద్వారంవైపు నుండి **రామకృష్ణహరి! జయ జయ రామకృష్ణహరి!** అనే నామం వినిపించింది. నామదేవుడు మహాద్వారం ముందు నిలబడి సంకీర్తనం చేస్తున్నాడు. ఆ నామ మాధుర్యానికి రుద్రస్వాహా కారానికి వచ్చిన వాళ్ళు కూడ పులకించిపోయారు. కాని నీలకంఠశాస్త్రిగారికి మాత్రం అది చెవిలో సీసం కరిగించి పోసినట్లుంది. ఆయన రెండు చెవులు మూసుకుని శివ శివ అనుకుని నామదేవుణ్ణి పెద్దగా కేకలు వేస్తూ కసురుకున్నారు. బయట జరుగుతున్న గోల విని శృంగేరి మఠాధీశులైన శంకరాచార్యులవారి ప్రముఖ

శిష్యులు కైవల్యానంద బయటకు వచ్చి ఏం జరుగుతున్నదిక్కడ? అని కన్నడ భాషలో ప్రశ్నించారు. కన్నడ భాష వినగానే నామదేవుడు **కన్నడ విఠలు కర్ణాటకకు ఏణె మాజలావిలయు వేద** అన్న జ్ఞానదేవుల కీర్తన పాడాడు. అది విన్న కైవల్యానంద "ఆది శంకరులు సైతం ఈ అద్వైత సిద్ధాంతాన్నే బోధించారు. వీళ్ళను ఆపమనటం సబబు కాదు అని కన్నడం అని లోపలకు వెళ్ళి పోయారు. ఇక విధి లేక నీలకంఠ శాస్త్రిగారు నామదేవుడివైపు తిరిగి "విన్నారుగా తప్పని సరిగా కీర్తన చేయదలిస్తే ఇక్కడ వద్దు. వేరే ఎక్కడైనా చేసుకోండి" అన్నారు.

**నామ -** అయితే ఎక్కడ చేసుకోమన్నారు?

**నీల -** గుడి వెనకవైపు చేసుకోండి.

**నామ -** ఆజ్ఞ.

నామదేవుడు భక్తులవైపు తిరిగి మనకు ఎక్కడైతేనేమి? సరే వారు చెప్పినట్లు వెనక్కే వెళ్ళి సంకీర్తన చేద్దాం అని గుడి వెనక వైపుకి వెళ్ళి సంకీర్తన ప్రారంభించాడు. నామదేవుడు వెనక్కు వెళ్ళగానే మహాద్వారం నామదేవుడి వైపుకు తిరిగింది. ఇదేమీ పట్టించుకునే స్థితిలోలేని నామదేవుడు పరవశంతో సంకీర్తనం చేస్తున్నాడు.....

నా మాట వినండి. శివకేశవుల భేదం మానండి.

నారాయణుడు అమృతం సేవిస్తే శివడు తెల్లబడ్డాడు.

శివుడు హాలాహలం త్రాగితే నారాయణుడు నీలంగా మారాడు.....

నీలకంఠ శాస్త్రిగారి చెవిలో ఈ మాటలు పడగానే ఆయనకు శివలింగం, నంది, గుడిగంట ఏమీ కనబడలేదు. గుడి క్రింద ఆధారం అయిన తాబేలూ, గర్భగుడీ సరేసరి. జ్యోతిర్లింగం కూడ కనబడలేదు. తీరా చూసుకుంటే తను పశ్చిమద్వారం వద్ద ఉన్నాడు. అందరూ భక్తిలో చిత్తుగా నానిపోయి నామదేవుడి చుట్టూ చక్రాకారంలో తిరుగుతూ భజనచేస్తూ, నృత్యం చేస్తున్నారు. నంది, తాబేలు, శివలింగం అన్నీ నామదేవుడి కీర్తన వినటానికి గర్భగుడితో సహా పశ్చిమదిక్కువైపుకి తిరిగాయి. నీలకంఠ శాస్త్రిగారికి కళ్ళు బైర్లు కమ్మాయి. ఆయన మెడలోని శివలింగం కూడా నామదేవుడి వైపే చూస్తున్నది, సంకీర్తన తనుకూడా వింటున్నట్లు. గాలికి కొట్టుపోయే గడ్డిపోచలాగా నీలకంఠ శాస్త్రిగారు నామదేవుడి పాదాలమీద పడ్డాడు. అదేమీ గుర్తించని నామదేవుడు ఇంకా పాడుతూనే ఉన్నాడు......

-సశేషం

# గురుకృప

(గతసంచిక తరువాయి) -శివ ప్రసాద్

**తురగ -** నాయనా భార్గవా! సందేహించకు. జుగుప్సను నీ దరికి రానీయకుండా ఇంద్రుడు చెప్పినట్లు ఆచరించు. లోకవంద్యుడైన గౌతమ మునీంద్రుని ఆశ్రమంలో నీవు అకుంఠిత శ్రద్ధతో, అఖండ భక్తితో నన్ను ఉపాసించి నాకు ఎంతో సంతోషాన్ని కలిగించావు. నీవు వరిష్ఠ తపోధనుడవు. అందువలననే తక్షకుడు దొంగిలించి తెచ్చిన కుండలములు నీకు తిరిగి లభించే ఉపాయము నీ గురుదేవుల కృపవలన నీకు ఇంద్రుడు చెప్పటం జరిగింది.

**ఉదం -** ఓ అశ్వరాజమా! నీవెవరో కూడ నేను ఎరుగను. అట్టి నిన్ను మా గురుదేవుల ఆశ్రమంలో నేను ఎప్పుడు ఉపాసించాను? ఎట్లా ఉపాసించాను? అసలు నీవెవరు?

**తురగ -** మహర్షీ నేను నీ గురుదేవులు ఉపాసించు అగ్నిని. నీ గురుదేవుల ఆజ్ఞననుసరించి నీవు గౌతమాశ్రమంలో ప్రతిరోజు శుచిర్భూతుడవై ఎంతో భక్తి పూర్వకంగా అత్యంత నియమనిష్ఠలతో పూజించిన పావకుణ్ణి. ఆ సంగతి నీకు గుర్తున్నదా! నీ గురుసేవా తత్పరతతో నీవు నీ గురుదేవుల అనుగ్రహమునకు పూర్ణముగా పాత్రుడవైనావు. గురుదేవుల అనుగ్రహమునే పొందిన నీకు నావంటివారి అనుగ్రహమునకు ఏమి కొదువ! సందేహించక చెప్పినట్లు ఆచరించు.

అన్ని సందేహాలు తీరిన ఉదంకుడు చెప్పినట్లే చేశాడు. తక్షణమే...

**పాతాళైక నికేతనాంతరమునన్ బర్వెన్ దదశ్వాఖిల**
**స్రోతో మార్గ వినిర్గతోగ్ర దహనార్చుల్ పన్నగ వ్రాతముల్**
**భీతిల్లెన్ భుజగాది నాధుమనమున్ భేదిల్లె గల్పాంత సం**
**జాత ప్రోద్ధత బాడబానల శిఖాశంకాధికాతంకమై ॥**

ఆ అశ్వము రోమకూపములలో నుంచి అంతటిని కప్పివేస్తూ ధూమము బయల్వెడలి పాతాళాన్నంతా ఆవరించి కప్పివేసింది. వాసుకీ, ఐరావతము, మొదలైనవారి వాసభూములన్నీ హాహా కారములతో ఆకులమైనాయి. అహికుల ప్రముఖులు భయంతో పరిగెత్తుకుంటూ వచ్చి ఉదంకుడి పాదములపై బడి ఆయన కోపానికి కారణం తెలుసుకున్నారు. ఇది కల్పాంతంలో ముఖమునుండి మూడవకంటినుండి దారుణమైన వహ్ని జ్వాలలు వెలువడుతున్న శంకరునితో సమానుడైన ఆ భూసురోత్తముడి కోపాగ్నే అయివుంటుంది అని అనుమానం వచ్చిన తక్షకుడు వెంటనే పరిగెత్తుకుంటూ వచ్చి ఉదంకుడి పాదాలకు భక్తితో నమస్కరించి కుండలములను అతడికి సమర్పించాడు.

ఉదంకుడు ఉరగములనన్నిటిని పంపివేశాడు. ఎంతో వినయంతో భక్తి పూర్వకంగా ఇంద్రాగ్నులకు ప్రదక్షిణ చేశాడు. అప్పుడతనికి గుర్తు వచ్చింది, గురుపత్ని తనను కుండలాలు తెమ్మని పంపినప్పుడు నాలుగోనాటికి తిరిగి రమ్మని చెప్పిన విషయం...

**ఉదం** - (తనలో) అయ్యో! ఎంతపని జరిగిపోయింది. గురుపత్ని ఆనాడు నన్ను ఆశీర్వదించి పంపుతూ, నాయనా! నేటికి తప్పక నాల్గవనాటికల్లా కుండలాలు తీసుకొనిరా. ఆ కుండలాలు ధరించి నేను వ్రతం చేసుకోవాలి అని చెప్పింది. ఈనాడే నేను గురుపత్ని వద్దకు చేరవలసిన రోజు, ఆమె ఈకుండలాలు ధరించి వ్రతం చేసుకునే రోజు. వెంటనే నేను అక్కడకు చేరి గురుపత్నికి ఈ కుండాలు సమర్పించకపోతే, ఈ చేసిన మహా ప్రయత్నం అంతా నిష్ఫలము, వృథా అవుతుంది. ఈ నాగలోకంలో నుండి నేను ఏ విధంగా బయట పడగలను. ఉన్నపాటున క్షణాలలో గురుదేవుల ఆశ్రమం ఎలా చేరగలను? గురుదేవా! ఇంతవరకు నన్ను కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చిన మీరే నన్ను ఈ విపత్తు నుండి రక్షించగల సమర్థులు. మీ విశ్వచక్షువుకు అగపడనిది లేదు. మీ శ్రోత్రేందియానికి మేము మనస్సులో అనుకున్నవి కూడ తెలుస్తాయి. అనంతమైన మీ కృపకు హద్దులు లేవు. మీ కృపకు అసాధ్యమైనది లేదు. మీకు సంపూర్ణంగా శరణు పొందుతున్నాను. నన్ను ఎలా రక్షించుకుంటావో నీదే భారము తండ్రీ!

**ది.పు** - నాయనా ! నీ విచారానికి కారణం అవగతమైంది. మహిత చరిత్రుడవు, ఏకనిష్ఠ గురుభక్తుడవు, గురుహిత కార్యార్థివైన నీకు గురుకార్యంలో సాయపడి ఆ గురుకృపకు పాత్రులం కావటం కన్నా మా జీవితాలకు ధన్యత వేరే ఏమున్నది. సందేహించక నీవు ఈ దివ్యాశ్వాన్ని ఆరోహించు. ఇది వాయువేగం కన్నా, మనోవేగం కన్నా వేగంగా ప్రయాణించగలదు.

ఉదంకుడు ఆ దివ్యపురుషుడు చెప్పినట్లు అశ్వరూపం ధరించి ఉన్న అగ్నిదేవునిపై ఎక్కాడు. కళ్ళు మూసి తెరిచేంతలో అతడు తన గురుదేవుల ఆశ్రమంలో ఉన్నాడు. గురుపత్ని శుచిస్నాతయై, నూతన వస్త్రాలు ధరించింది. ఇక కుండలాలను ధరించటమే మిగిలింది. ఆమె ఉదంకుడికోసం ఎదురు చూస్తున్నది. అంతలో ఉదంకుడు ఆ కుండలాలు తెచ్చి ఆమె పాదాలకు సాష్టాంగ ప్రణామం చేశాడు. గురుపత్ని కూడ ఉదంకుణ్ణి అత్యంత ఆదరంతో లేవనెత్తి అనేక దీవెనలిచ్చింది. అంతలో గౌతముడు అక్కడకు వచ్చాడు. ఉదంకుడు గురుదేవుల పాదాపై వాలాడు. ఆయన ఉదంకుణ్ణి లేవదీస్తూ కరుణ ఉట్టిపడే దృక్కులతో చూస్తూ......

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గతసంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

అందువలన ముందు కాలాన వృక్షరూపంలో ఉండి జ్ఞానివై సాధన పూర్తి చేసి మోక్షం పొందుతావు పో!'' అని కృపా సముద్రులైన గురుమూర్తి వానిని అనుగ్రహిస్తూ పలికారు. సుదర్శనుడు చింతా భరిత హృదయంతో గురుమూర్తి వద్ద సెలవు తీసుకుని వెంటనే ఆశ్రమం విడిచి పోయి పోయి అక్కడ కనిపించిన నదిలో మునిగి దేహత్యాగం చేశాడు. ఆ నది యమునాది. అది పవిత్రమైన బృందావన సీమ. ఆ యమునానదీ తీరాన ఒక వెదురు మొక్క మొలిచింది. క్రమంగా ఎదిగింది. కొమ్మలు రెమ్మలు శాఖోపశాఖలై విస్తరించింది. అది వ్యర్థమైన మాటలు పలకలేదు. ఎదిగే కొద్దీ జ్ఞానాన్ని పెంచుకుంది. పూర్వ సుకృతమేమో చుట్టూ పరిసరాలను సత్య దృష్టితో పరికించగల శక్తి లభించిదా వెదురు మొక్కకు. నిత్యమూ అక్కడ జరిగే ఆనంద దాయకమైన దృశ్యాలను తిలకిస్తూ పులకరించి పోతూ ఉంటుంది. పగలంతా ఒక చిన్ని అందాల బాలుడు తోటి బాలురతో కలిసి గోవులను మేపటానికి వస్తుంటాడు. వారితో చెట్లెక్కి ఆటలు, చెట్లక్రింద చల్దులు ఆరగించటాలు, ఉరుకులు పరుగులు కేరింతలు వెక్కిరింతలు అన్నీ చేస్తుంటే చూడటానికి వేయి కళ్ళున్నా చాలవనిపిస్తుంది. రాత్రయేసరికి వెన్నెల పుచ్చపువ్వులా కాస్తుంటే ఆ చిన్నారి ముద్దుల బాలుడే రమణీ సమేతుడై వారందరూ రాసకేళీలోలురై విహరిస్తుంటే అది లోకాతీతమైన దృశ్యంగా కనిపిస్తుంది. అందరూ వానిని కన్నయ్యా అనో కిష్టయ్యా అనో గోపాలా అనో పిలుస్తూ మురిసిపోతూ ఉంటారు. ఒకనాడు ఆ నారీజనమంతా వానిచుట్టూ చేరి పాటలు పాడుతూ పువ్వుల దండలల్లి వాని అందమైన మెడలో అలంకరిస్తూ ఉన్న వేళ...

"కన్నయ్యా! నువ్విక్కడికి వచ్చే సమయం మాకు తెలియకుండా పోయేసరికి ఒకోసారి మేము ఇంటినించి పరుగెత్తి వచ్చినా నీతో ఆటపాటలలో పాల్గొనేందుకు వెనక బడిపోతున్నాము కనుక ఓ దయామయా! నువ్వీ తావుకు వచ్చిన గుర్తు తెలిసేందుకు మాకు

సంకేతం ఏదైనా చూపవా?" అని వేడుకున్నారు. "మా కోరిక తీర్చండి స్వామీ!" అని ప్రార్థించారు. బాల గోపాలుడు క్షణం ఆలోచించాడు. చటుక్కున లేచి ముందుకి నడిచాడు. దాపునే ఉన్న వెదురు మానుకు ఎదురై నిలిచాడు. సుకుమారమైన చేతితో అతి సున్నితంగా ఆ మాను నుంచి ఒక వెదురు ముక్కను గ్రహించాడు. దివ్యమైన ఆ స్పర్శకు ఆ మానుకు ఒళ్ళంతా ఝల్లుమంది. గురుదేవుని ఆజ్ఞప్రకారం ఆ క్షణానే సాధన పూర్తయిన ఆ వెదురు మానుకు దేవదేవుని అమృత హస్తం సోకగానే విముక్తి లభించింది. అదింక మోక్షదాత వల్లనే శాపవిమోచనమైనందున పలక గలదు.

గోపబాలుడు ఆ వెదురు గొట్టాన్ని తన తీయని పెదవులపై మోపి దివ్యమైన రాగాలను పలికించాడు. అది వింటూ గోపీజనులు సమ్మోహితులై పోయారు. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని అదే పనిగా వానిని చూడసాగారు. అతగాడు చిగురాకుల వలె ఎర్రగా ఉన్న కరకమలంలో ఒదిగి ఉన్న పిల్లన గ్రోవిని పలికిస్తూ ఆ గీతాల మాధుర్యంలో మునిగి ఉన్నాడు. సొగసైన అరుణాధర కాంతుల సమూహంలో వాని ముఖం మెరిసిపోతున్నది. వాని దివ్య చరణారవిందాలు పూసిన మోదుగ పువ్వుల ఎరుపును తిరస్కరిస్తున్నాయి. అరుణారుణ రాగరంజితాలైన వాని అవయవ సౌందర్యానికి ముగ్ధలైన గోపీరమణులకు స్వామిపైగల అనురాగమంతా హృదయాలలో నిండి పొంగిపొర్లే అవధుల్లేని జలధారలై ప్రవహించింది.

"జగన్నాధా! ఈ మృదువైన మధురాతిమధురమైన వేణు నాదాన్ని వింటూ దయామయుడవైన మీ జాడ తెలిసి మీ వద్దకు చేరే మహద్భాగ్యం మాకు లభించగలదు. మీ తీయని పిల్లనగ్రోవి మాకు దారి చూపుతుంది. మేము ధన్యులం ప్రభూ!" అంటూ నందనందనుని ఆలింగనమొనర్చుకుని ఆనంద పరవశలైనారు. వారి రాగారుణిమ ఎదలపై అలదుకున్న కుంకుమలాగా ఆ కుంకుమ పంకమంటిన దేహంతో స్వామి అరుణ కమలం వలె ప్రకాశించాడు. నిగ్రహానుగ్రహ సమర్థుడైన అట్టి సద్గురు రూప శ్రీకృష్ణ దేవుని సదా ఆశ్రయిస్తున్నాను.

-సశేషం

# మౌనధ్యాన సప్తాహశిబిరం

-రమణ ప్రసాద్

(శ్రీ కాళీగార్డెన్స్‌లో అక్టోబర్ ది. 10 నుండి ది. 16 వరకు మౌనధ్యాన సప్తాహం పూజ్య యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీవారి నేతృత్వంలో జరిగింది. ఇందులో ఆశ్రమ వాసులేకాక ఇతర ప్రాంతాలనుంచి భక్తులు పాల్గొన్నారు. ఈ సప్తాహాలలో పూజ్యశ్రీ మాతాజీ, భక్త సోదర సోదరీమణులు ధ్యానంపైన ప్రసంగాలు చేశారు. శ్రీమాతాజీ భక్తులకు ధ్యానంలో కలిగే సందేహాలను తీర్చారు. శ్రీమాతాజీ చేసిన ప్రసంగాలను సంక్షిప్తంగా ప్రచురిస్తున్నాము.) -ఎడిటర్

భోగం వీడితే యోగం వస్తుంది. భోగంతో రోగం వస్తుంది. ఆధారం ఉంటే చాలు మనస్సు లతల్లే అతుక్కుపోతుంది. ఇక్కడి వాతావరణం ఎలాంటిది? ఎంత పవిత్రమైనది? స్వామివారు రామాలయంలో వాకింగ్ చేశారు. ఇక్కడ ప్రతిష్ఠితమైన ఇద్దరు దేవుళ్ళముందు ఈ గురుదేవుడు మనతో సంచరించారు.

**ధ్యానమూలం గురోర్మూర్తిః పూజామూలం గోరోఃపదం ।**
**మంత్రమూలం గురోర్వాక్యం ముక్తిమూలం గురోఃకృపా॥**
**గురుమహరాజ్ గురుమహరాజ్ గురుదేవో సద్గురు మహరాజ్**
**గురునామ మహామంత్రజయగురు జయగురు**
**గురుహి పరమగతి జయగురు జయగురు**
**సకల సాధన గురు జయగురు జయగురు**
**జయగురు జయగురు సచ్చిదానంద గురు**
**గురుమూర్తిం స్మరేనిత్యం గురోర్నామ సదాజపేత్**
**గురోరాజ్ఞాం ప్రకుర్వీత గురోరన్యం నభావయేత్ ॥**

ఈ గురుగీత మహామంత్రం అందరికి వచ్చి ఉండాలి. ధ్యానమూలం గురోర్మూర్తి - ధ్యానం పరధ్యానం కాకుండా ఉండాలి. ఈ 2 గం॥లే కాదు ప్రతిరోజు ఎన్ని గంటలు వెళ్ళిపోతున్నాయో.... ఇలా ఎన్ని ఏళ్ళు గడిచి పోతున్నాయో సాధనకు మనకు గురుదేవులు ఇన్ని సదుపాయాలు ప్రసాదించారు. గోవిందాసనం కూడ వేసుకు కూర్చోవచ్చు. గోడకు ఆనుకోవచ్చు. నిద్ర రాకుడదు. గోవిందాసనంలో గోవింద స్వరూపాన్నే పొందాలి. జీవ స్వరూపం పొంద కూడదు. పదార్థ భావన సాధనకు అడ్డువస్తుంది.

పూజామూలం గురోః పదం - అవతారానికి వచ్చి "ఈ పాదం మీది" అన్నారు. గురుదేవులతో సముద్ర స్నానాలు చేశాం - వచ్చేపోయే కెరటాలకు మనం ఏమైపోతామోనని అందరూ ఆయనను పట్టుకొని వీపు రక్కేసి, గీరేసి,... "ఏమిటి బాబూ! ఇదంతా" అంటే "పోనీలే రెండురోజులలో తగ్గిపోతాయి" అనేవారు. మంచినే భావన చేయాలి. చెడును భావన చేయకూడదు. మానసంలో మంచినే గూడుకట్టుకొని ఆనందాన్ని అనుభవిద్దాం.

మంత్రమూలం గురోర్వాక్యం - ఏది మంత్రం? గురుదేవులు ఏది చెప్తే అదే మంత్రం.

ముక్తిమూలం గురోఃకృపా - ఇక్కడ తృప్తి ఎవరికి లేదు చెప్పండి? గురుదేవులు "ఇన్ని దేవుళ్ళను ఇచ్చాను, మీరు తెలుసుకోవలసినది తెలుసుకోలేదు. నా శక్తిని ఈ మూర్తులయందు పెట్టాను. రామ, సీతా, లక్షణ, ఆంజనేయస్వాములను ప్రతిష్ఠించాను. రాధాకృష్ణులను పెట్టాను. అభిషేకానికి రామలింగేశ్వరులను ఇచ్చాను. మీకు గ్రహ పీడ ఉంటే నవగ్రహాలను ఇచ్చాను" అని చెప్పారు. గురు అనుగ్రహం ఉంటే ఏ గ్రహం బాధిస్తుంది? మనకు భయంలేదు. ఎందుకంటే ఆయన అభయహస్తం దిగేది లేదు. వారి పాదాలు మనకే. మీకు ఈ రూపం కాలాలి కదా అని సుగుణ భూషణులై మనముందు నిలిచారు.

**నీవల్ల గుణదోషమేమి శ్రీరామ - నావల్లనేగాని నళినదళనయనా.**
నాయనా! నీదోషం లేదు. నా వల్లనే. ధ్యానం నిలవక పరధ్యాస అయిపోయింది. భక్తుడికి direct గా అడిగే హక్కు భగవంతుడు ఇచ్చాడు. మనస్సు నిలిస్తే భగవంతుడు ఉన్నాడు అని తెలుస్తుంది.

ఇంట్లో ఉంటే మనం ఏం చేస్తాం. T.V. చూసేవాళ్ళం. paper చదివేవాళ్ళం. phone లో మాట్లాడుకొనేవాళ్ళం. ఇక్కడ ఉంటే ముక్తే! ఏమిటి ముక్తి? వీతరాగం. అదే గురుగీతలో గుర్తు చేస్తున్నారు. 'గురుమూర్తిం స్మరేన్నిత్యం' అని. గురు సన్నిధిలో గురుత్వ స్థితిని మనస్సు పొందాలి. భావనా పరంపరలచేత భగవద్భావం కలగకపోతే. 'జపం చేసుకో', 'స్మరణ చేసుకో'.

శ్రీరామ జయరామ జయజయ రామ! - అని స్మరణచేస్తే ఆ రూపానికే తీసుకు వెళ్తారు.

లుంగీ కట్టుకొని, లాల్చీ వేసుకొని, కర్ర పట్టుకొని బనియన్‌కు ఉన్న చిన్న జేబులో కర్చీఫ్ పెట్టుకొని ఉన్న బాబును తల్చుకుంటే అది అనుభూతి

కాదా! ఎవరైన వస్తే 'వాళ్ళు ప్రపంచ విషయాలకు వచ్చారులే' అనేవారు. కరెంట్ ఉంటేనే ఫ్యాను తిరుగుతుంది. ఈ దేహం అనే ఇల్లు కూడ చైతన్యం అనే కరెంట్ చేత నడుస్తుంది. ఆ ప్రభువు యొక్క నీడే జగత్తు. దోషదృష్టి ప్రక్కన పెట్టి దైవ దృష్టితో చూస్తే ప్రభుతత్త్వాన్ని పొందుతారు.

ఎక్కడ ఉన్నాం మనం ఇప్పుడు?

**మానస సంచరరే బ్రహ్మణి**
**మదశిఖి పింఛా అలంకృత చికురే**
**మహనీయ కపోల విజిత ముకురే**
**శ్రీ రమణీకుచ దుర్గ విహారే సేవక జన మందిర మందారే**
**పరమహంస ముఖ చంద్ర చకోరే**
**పరిపూరిత మురళీరవధారే**

ఎక్కడ ఉన్నారాయన? గుళ్ళో ఉన్నారా? అక్కడ ఉంటే ఆయనకు తోస్తుందా? లేక గూట్లో ఉన్నాడా? మనం అందరికీ చూపిస్తాం. ఎక్కడ ఉన్నాడని చెప్పాలి? వచ్చి వచ్చి మానస సంచరరే, ఇక్కడ నీతో సంచరించిన ఆ బ్రహ్మం నీ మనస్సులో ఉన్నది. ఇది అమ్మవారి పాటా? అయ్యవారి పాటా? అని డౌట్ అక్కరలేదు. 'సర్వ పురుషార్థ స్వరూపిణ్యై నమః' అంటే భేదం ఎక్కడిది? శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులు అక్కడ స్త్రీ పురుష భేదం లేకుండా పాడారు.

మదశిఖిపించాలతో ఉన్న స్వరూపం. వారు మన కోసం అవతారం తీసుకుంటారు. మనకోసం ఎన్నో కష్టాలు పడతారు. శ్రీ అంటే మంగళం. రమ అంటే కాంతి. రాముడు కాంతిలోంచి వచ్చాడు. మేఘాలు రాసుకుని మెరుపు రావటంలా? అలా ఇద్దరు భక్తులు కలిస్తే ఉన్నది ఉన్నట్లు తెలుసుకుంటారు. ఆయన సేవక జన మందిరంలో మందారమై కూర్చున్నారు. సేవకులు, ఎవరైతే భృత్యస్య భృత్య....... అనుకొంటున్నారే వారి హృదయాలలో మందారమై ఉన్నాడు. చంద్ర చకోరే. చంద్రుని కోసం చకోరంలా ఎదురు చూస్తే అతడు మ్రోగించే మురళీరవం అనే ప్రణవనాదం వింటాం. అది గురుదేవుల ముఖస్థుగా వింటాం. కాబట్టి మనం ప్రణవంతో మొదలు పెట్టుకొన్నాం. ప్రణవంతో పూర్తి చేసుకుంటున్నాం.

-సశేషం

# మాతాజీ బోధామృతం

- శివ ప్రసాద్

(2009 శరన్నవరాత్రములలో ది 28-9-09 నాడు శ్రీమాతాజీ ప్రబోధమునకు సంక్షిప్త రూపం)

గురుదేవులు చెప్పేవారు "తెల్లవారు జామున ప్రార్థన చేసుకో. తరువాత కావాలంటే పడుకో." మనకు పరమార్థ తత్త్వాన్ని గురించి వివరిస్తూ, "నిన్ను నీవు గుర్తించు." అని మనచేత గుర్తింప చేసే సమర్థత సమర్థ సద్గురు దేవులకే ఉంటుంది.

తెల్లవారు జామున లేస్తే అప్పుడు నీవు ధర్మాన్ని పాటించినట్లు. నీవు ఎప్పుడైతే ధర్మాన్ని పాటిస్తావో అప్పుడు హాయిగా, ఆనందంగా ఉంటావు. ఏదీ పట్టుదలగా చెయ్యటంకాదు ఆనందంగా, ఇష్టంగా చెయ్యాలి. ధ్యానం నా రూపం అయి ఉన్నది. అందులో మనస్సు చేరి అది పరధ్యానం అవుతున్నది. మనం అందులోకి వెళ్ళకూడదు. మన స్వరూపం ధ్యానం. నా ప్రభువు ఉన్నాడు నన్ను తరింప చేయటానికి.

గురుదేవులు నా భక్త సోదరులకు భోజనం పెట్టిస్తున్నారు. ఏం? మిగులుస్తున్నావేంటి? నీకు తక్కువ అవుతుందనుకుంటున్నావా? అంటూ ఉన్న గిన్నెలు అన్నీ తెచ్చి వడ్డించేవారు. గురు సోదరులకు ఏమేం కలుపుకోవాలో చెప్పేవారు. మంచి పెరుగు అన్నంలో లడ్డు కలిపించి తినిపించారు. తినకపోతే 'ఏం వెంకటరత్నం? పంచకొంచెం లూజ్ (loose)చెయ్యి, లోపలికి వెళ్తుంది అనేవారు. ఎక్కడెక్కడి దోషాలను బయటకు తెచ్చి, వాటిని సమూలంగా దహించటం ఆ గురుదేవులకే చెల్లు. దృష్టి ప్రసారమాత్రేణబహుళా పన్నివార కాయ నమః అని వారి నామాలలో ఉన్నది. మామూలు దృష్టి కాదు వారిది. స్వార్థం, అసూయ, ఓర్వలేనితనం వంటివి లేని సత్య దృష్టి, అనంతమైన దృష్టి.

తింటే అలాంటి దాన్ని తినాలి. మరచినను మరపురాదు. అటువంటి అనుభవాలు మనకు అనేకం. చైతన్యం లేకపోతే ఇంద్రియాలు ఏమి పని చేస్తాయి? అసలు బయట ప్రపంచం ఏం పనిచేస్తుంది? పంచత్వం పొందిన తరువాత నీ బిరుదులూ లేవు, ఏమీ లేవు.

మేనును గుఱించి కాదు ఆలోచించేది. ఆ మేనును ప్రకాశింప చేసేది ఒకటి అందులో ఉన్నది. అదే అమ్మ. ఆ అమ్మ సాయకాలను ధరించింది. శ్రీం, హ్రీం, క్లీం, ఐం, సౌం, అనే బీజాక్షరాల సాయకాలను అమ్మ ధరించింది.

అవన్నీ మనం రక్షించ బడటానికే, భక్తులను ఉద్ధరించటానికే, అటువంటి తల్లి పంచతన్మాత్ర సాయకా. దానినే వివేక చూడామణిలో

**శబ్దాదిభిః పంచభిరేవ పంచ పంచత్వ మాపుః స్వగుణేన బద్ధాః**
**కురంగ మాతంగ పతంగ మీన భృంగ నరః పంచభిరంచితః కిమ్**

అని శంకర భగవత్పాదాచార్యులవారు చెప్పారు. నాన్నగారికి ఈ శ్లోకమంటే ఎంత ఇష్టమో, మాటిమాటికి చదివించుకొనేవారు.

**శబ్దం:** లేడిని పట్టుకొనేవాడు, మేతవేసి, వలపన్ని ఒక చెట్టు చాటున నిల్చొని మురళి వాయిస్తుంటాడు. శబ్దానికి చెవికోసుకొనే లేడి, ఆ నాదం వినవస్తున్న వైపుకు వస్తూ వలలో పడిపోతుంది. పడిపోతే బంధనే. పతనమే. పతనం లేడికి శబ్దమంటే చెవికోసుకొనే దాని స్వభావం వలన వచ్చింది.

**స్పర్శ:** ఏనుగులను పట్టేవాడు ఒక ఆడ ఏనుగుకు చక్కగా తర్ఫీదు ఇస్తాడు. అది అరణ్యంలోకి వెళ్ళి తన తొండంతో ఒక మగ ఏనుగుకు స్పర్శ సుఖాన్ని అందిస్తుంది. దానితో ఆ మగ ఏనుగు, నీవు ఎటంటే అటే, నీవు ఎక్కడికి రమ్మంటే అక్కడికే అని, ఆ స్పర్శ సుఖం కోసం ఆడ ఏనుగు వెంట వస్తుంది. దేహానికి దురద పుడితే గోక్కుంటే తగ్గుతుంది. కాని మనసుకు దురద వస్తే..... పతనమే. తరువాత అది ఆడ ఏనుగుతో, ఏనుగులను పట్టేవాడు త్రవ్విన, కప్పిపెట్టిన గోతి దగ్గరకు వస్తుంది. ఆడ ఏనుగు ఉపాయంగా గోతిలో పడకుండా తప్పుకుంటుంది. మగ ఏనుగు ఆ గోతిలో పడుతుంది. ఏనుగులను పట్టుకొనేవాడు కొన్నాళ్ళు ఆ ఏనుగుకు ఆహారం పెట్టకుండా చేస్తాడు. మన సంగతి కూడ అంతే, కాఫీ అలవాటైన వాడికి రెండు మూడు గంటలు కాఫీ రావటం ఆలస్యమైతే, ఏమిటోగా ఉంది అంటాడు. దాన్ని బాగా మాడ్చిన తరువాత, దానికి కొంచెం కొంచెం ఆహారం ఇవ్వటం మొదలు పెడ్తాడు. అప్పుడు అది ఆ ఏనుగు పట్టేవాడు ఎలా చెప్తే అలా వింటుంది. ఏనుగుకు పతనం స్పర్శ సుఖానికి లొంగే దాని స్వభావం వలన కలిగింది.

**రూపము:** మిడుత పండు అనుకొని ఆశించి దీపం మీదకు దూకి మంటకు ఆహుతై పోతుంది. రూపానికి లోబడే స్వభావం వలన మిడుత పతనం అవుతుంది.

**రసము:** చేపలు పట్టేవాడు గాలానికి ఎఱ్ఱను గుచ్చుతాడు. చేప వచ్చి ఆహా నాకు ఆహారం దొరుకుతున్నది కదా! అని ఆ ఎఱ్ఱను మింగుతుంది. దానితో ఆ గాలానికి ఉన్న ముల్లు దాని గొంతులో గుచ్చుకుంటుంది. ఇక చేప దానిని

విడిపించుకోలేదు. అంతలో చేపలు పట్టేవాడు గాలాన్ని బయటకు లాగి, ఆ చేపను పట్టుకుంటాడు. రుచికి లోబడే స్వభావం ఉన్న చేప బాగుంది కదా తిందాము అని అలా వెళ్ళి చచ్చిపోతుంది.

**గంధ:** తుమ్మెద ఏ పువ్వు మీదైనా వాలవచ్చు కాని సంపెంగ పూవు మీద మాత్రం వాల కూడదు. వాలితే చస్తుంది. మనమైనా సంపెంగ పూవును ముక్కు దగ్గర పెట్టుకొని గట్టిగా వాసన చూడ కూడదు అని గురుదేవులు చెప్పేవారు. అలా వాసనకు ఆకర్షింపబడే స్వభావం వలన తుమ్మెద చచ్చిపోతుంది

ఈ అయిదూ అవి వాటివాటికి ఉన్న ఒక్కొక్క గుణం చేతనే చచ్చిపోతున్నై. మరి మానవుడికి ఈ అయిదూ ఉన్నై. వీటిలో దేనికి లోబడినా పంచత్వమే. వీటికి లోబడే స్వభావం వలననే మానవుడు అమృతత్వాన్ని సాధించలేకపోతున్నాడు. మనం ప్రేతత్వాన్ని పొందకుండా అమృతత్వాన్ని సాధించటానికి ఆ అయిదు తన్మాత్రలు ఆయుధాలుగా గల అమ్మను ఆశ్రయిస్తే, మనకు అమ్మ మనం వాటికి లోబడకుండా ఉండే దృష్టిని ప్రసాదిస్తుంది.

**పంచ బ్రహ్మాసన స్థితా:**

అయిదు బ్రహ్మ రూపాలకు కారణం ఒక్కటే పర బ్రహ్మ స్వరూపం. అలాగే పంచ ప్రాణ వాయువులకూ, పంచకోశాలకు కూడ. అందుకే అమ్మ పంచకోశాంతరస్థితాయై నమః. ఏమిటా పంచ కోశాలు. అన్నమయ కోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, ఆనందమయకోశం, విజ్ఞానమయ కోశం. వీటన్నిటికి తానే అధినేత్రిగా ఉండి శరీరంలో దేనికి అంద వలసినది దానికి అందేలా చూస్తుంది అమ్మ.

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీ బాబూజీ మహరాజ్‌వారి ప్రియ భక్తులైన కీ.శే. వారణాసి ఆదినారాయణ శాస్త్రిగారి ద్వితీయ సంతానం అయిన శ్రీ వారణాసి శివరామకృష్ణ ప్రసాద్ ది. 24-1-10 ఆదివారం నాడు ఉదయం గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 52 సం॥లు. వారికి ఒక సోదరుడు, ముగ్గురు సోదరీమణులు కలరు. గురుదేవులు వారి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక!

# మాతాజీ సత్సంగ్ డైరీ

-రమణ ప్రసాద్

శ్రీ మాతాజీ మొదట నారాయణహరి నారాయణహరి నారాయణహరి నారాయణా అనే నామం తాము ఎంతో మధురంగా సంకీర్తన చేస్తూ అందరితో చేయించారు.

సర్వేశ్వరుడు, సర్వాధిష్ఠాన చైతన్య స్వరూపుడు, సర్వ వ్యాపకుడు, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు, సమర్థ సద్గురు దేవులు అయిన ఆ గురు పరమాత్మ అనుగ్రహంతో మూడవరోజు ఇలా సేవ చేసుకునే భాగ్యం లభించింది. భగవంతుడి లీల అమోఘమైనది, అనంతమైనది. ఆశ్చర్యకరమైనది. అసలు ఆయన లీలే అటువంటిది. ఆ లీలను అర్థం చేసికోవటం కష్టం. శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీతలో

**ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనం ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః**
**ఆశ్చర్యవచ్చైన మన్యఃశృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥**

- భగవద్గీత

అంటాడు. భగవంతుడి లీలా వైభవాన్ని మానవుడు తన శక్తి ఎంతవరకు ఉంటే అంతవరకే చూస్తాడు. అంతవరకే గ్రహిస్తాడు. కొందరు ఆశ్చర్యంగా చూస్తారు, ఆశ్చర్యంగా వింటారు, ఆశ్చర్యంగా చెప్పుకుంటారు కాని ఆ భగవంతుడి మీద మనస్సు ఎంత ఏకాగ్రంగా నిలప గలుగుతారు?

మనం పూజ చేస్తుంటాం. చటుక్కున మనస్సులో ఏదో ఒక సంకల్పం వస్తుంది. సరిగ్గా అదే సమయంలో ఆ స్వామికి పూజ చేసిన ఒక పుష్పం మన శిరస్సు మీదనో, చేతులలోనో పడిందనుకోండి, మనకు ఎంత ఆనందం కలుగుతుంది! ఎంత ముద్దు వస్తాడండీ ఆ భగవంతుడు? ఎందుకు? మన కోర్కె తీరుస్తాడని, మన కోర్కె నెరవేరుతుందని. తప్పకుండ నెరవేరుతుంది కూడ, ఆ విశ్వాసం ఉంటే.

బాగా ఆకలివేస్తున్నది. భోజనం చేద్దామని అన్నం కలుపుకొని ముద్ద నోట్లో పెట్టుకోబోతుండగా ఏదో ఫోన్ కాల్ వస్తుంది. ఇన్‌కంటాక్స్ రెయిడ్‌కి సంబంధించి అయి ఉండవచ్చు, లేదా ఏదో అర్జంటు వ్యవహారానికి సంబంధించి కావచ్చు. లేదా ఏదో వినరాని వార్త అయి ఉండవచ్చు. వెంటనే అన్నం వదిలేసి లేచిపోతున్నాడు. భోజనం చెయ్యాలనుకున్నాడు కదా?

భోజనానికి కూర్చున్నాడు కదా? మరి ఆ ఆకలి ఏమైంది? ఎందుకు లేచి పోతున్నాడు? మనం బయటకు వెళ్ళాలనుకున్నాం. గడపదాటి బయటకు వచ్చాము. నాలుగడుగులు వెయ్యగానే గబగబా వర్షం పడటం మొదలైంది. మనం వెంటనే వెనక్కు తిరిగి త్వరగా ఇంట్లోకి వస్తాము. ఏదో ముఖ్యమైన పని ఉన్నదనేగా బయలుదేరాము. మరి వెళ్ళకుండా ఎందుకు వెనక్కు వచ్చాము? మనలో మనో నిగ్రహం లేదు. పట్టుదల లేదు. మనో నిగ్రహం ఉండాలి. భగవంతుడి అనుగ్రహం ఉండాలి. అది ఉంటే అన్నీ జరుగుతాయి. నిజానికి ఆయన అనుగ్రహంతోనే మనం అన్నీ చేయగలుగుతున్నాము. ఎవరైతే దానిని గుర్తిస్తారో వారు ధన్య జీవులు. ప్రహ్లాద కుమారుడు అటువంటి ధన్యజీవి.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు, ప్రహ్లాదుడు పుడుతూనే 'ఓం నమో నారాయణాయ' అంటూ తల్లి గర్భంలోనుంచి బయటకు వచ్చాడు. హిరణ్య కశిపుడు ప్రహ్లాదుడి తండ్రే అయినా, మనందరం అతన్ని ఒక విలన్‌ను చూసినట్లు చూస్తాము కాని ప్రహ్లాదుణ్ణి ఎలా చూస్తాము? హిరణ్య కశిపుడు అతడిని పెడుతున్న కష్టాలను, బాధలను చూసి, ఒకవైపు ఆ హిరణ్య కశిపుణ్ణి చంపేద్దాము అన్నంత కోపంతో గుండెల్లో మంటలు చెలరేగుతూ ఉంటే ప్రహ్లాద కుమారుడు ఒక్కొక్కదానిలో నుంచి కసుకందక, చిరునవ్వుతో 'ఓం నమో నారాయణాయ' అంటూ బయటకు వస్తుంటే, మనకు మరో వైపు ఎంత ఆనందం కలిగింది! అసలు ప్రహ్లాదుడు అంటే ఏమిటి? అది అతని పేరులోనే ఉన్నది. హ్లాదం అంటే ఆనందం. అందుకే ప్రహ్లాదుడు అంటే అంత ఆనందం. అది వస్తూ పోతూ ఉండే ఆనందం కాదు. ఎప్పుడూ ఉండిపోయే ఆనందం.

పూర్వం ఎవరైనా అతిథులు వస్తే ఇంట్లో స్వయంగా వంటచేసి వారికి భోజనం పెట్టేవారు. ఆ సేవలో ఎంత ఆనందం ఉన్నది! ఒకవేళ ఆలస్యం ఉంటే కూర్చోటానికి ఇంటి ముందు అరుగులు ఉండేవి. ఇప్పుడు వండి వడ్డించటం పోయింది. వండింపించి వడ్డింపించటం వచ్చింది. అదే కేటరింగ్ (catering) అన్నమాట. డబ్బులు పారేస్తే ఎవరో భోజనాలు తెచ్చి పెట్టేసి వెళ్తే మనకు పుణ్యం ఎలా వస్తుంది? ఆ సేవలోని ఆనందం ఎలా లభిస్తుంది? మొన్న ఈమధ్య ఎక్కడికో వెళ్ళాము. ఇంకా ప్రసాదానికి ఏమీ ఏర్పాట్లు జరుగుతున్నట్లు లేదనిపించి, 'ఏమమ్మా! తీరికగా కూర్చున్నారు ప్రసాదాలు........" "ఆ ఏముందమ్మా కేటరింగ్‌కి ఇచ్చాము కదా! డబ్బులు పారేస్తే అన్నీ వాళ్ళే చూస్తారు. మేము కూడ అందరితోపాటు తింటాము"

అన్నారు. ఈ రోజుల్లో డబ్బులు పారేస్తే పనులు అవుతున్నాయి, నిజమే. కాని భగవంతుడు 'నీవు చేస్తే తింటానురా' అని ఎందరికో అవకాశం ఇస్తున్నా ఆచరించేది ఎందరు? మహాత్ములకు, గురుదేవులకు కూడ హోటలు నుంచి తెప్పించి పెడతాము అంటే ఎలా ఉంటుంది? అమ్మో! మాకు అదే అలవాటు అంటే ఇంకా ఏమి చేస్తాము? ఛస్తామా? "భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు'' అన్నాడు యోగి వేమనగారు. ముందుగా చెప్పాపెట్టకుండా భోజనం సమయానికి వచ్చేవాడు అతిథి. అటువంటి అతిథికి భోజనం పెట్టిన వారు పుణ్యలోకాలుపొందుతారు. ఈ రోజుల్లో భోజనం చేయకుండా ఎవరింటికైనా భోజనం సమయానికి వెళ్ళాలి అంటే ఎన్ని గుండెలుండాలి? ముందు ఫోన్ చెయ్యాలి వస్తున్నాము అని. అప్పుడు వాళ్ళే ఫోన్‌లో అంటారు, మీరు భోజనం చేసే వస్తున్నారా? ఆ అయినా మావంటి వాళ్ళ ఇళ్ళల్లో మీరు భోజనం ఎందుకు చేస్తారులెండి? అని. లేకపోతే వీళ్ళైనా చెప్పాలి, మేము భోజనం చేసి వస్తున్నాము, దయచేసి మాకోసం ఏర్పాట్లు ఏమీ చేయకండి అని. ఇవన్నీ ఎలా ఉన్నాయి? హృదయం ఆనందంతో స్పందించేలా ఉన్నాయా లేక దానిని కూలదోసేలాగా ఉన్నాయా? మళ్ళీ మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవో భవ, అతిథి దేవోభవ అని గొప్పగా చెప్పుకుంటాము. ఇప్పుడు ఎవరి ఇంటిముందైనా అరుగులు ఉన్నాయా? ఒకవేళ ఎక్కడన్నా ఉంటే, దానిమీద కూడ ఏదో కట్టి అద్దెకిస్తున్నారు. కొందరు కుక్కలున్నై జాగ్రత్త అని కుక్క బొమ్మ ఉన్న బోర్డులు గేట్‌కు కడుతున్నారు. ఇక ఏ అతిథి అయినా ఆ ఇంటికి పోవటానికి సాహసిస్తాడా? ఇవన్నీ చూస్తుంటే మనను అనుగ్రహించటానికి అతిథిగా వచ్చిన నారాయణుడికి మనం ఏ స్థానం ఇస్తున్నాము? అనిపిస్తుంది. ఇక అవ్యక్తుడైన ఆ భగవంతుడికి ఏం స్థానం ఇస్తాము?

భగవద్భక్తి ఉన్నా దానిని గుర్తించకపోతే భక్తి ఎలా వస్తుంది? ప్రహ్లాద కుమారుడికి తన గురుదేవుల ద్వారా భక్తి అబ్బింది. ఎవరో అడిగారు గురుదేవులను 'ఏమండీ హిరణ్య కశిపుడు ప్రహ్లాదుడికి చెప్పిన దానిలో తప్పు ఏమున్నది? నాయనా మన కులదైవం శివుడు ఆయనను పూజించు, ఆయన నామం అను,లేదా నేను నీ తండ్రిని, ముల్లోకాలను జయించిన వాణ్ణి, నా నామం స్మరించు అనే కదా అన్నాడు. తండ్రిమాట వినకుండా నిరంతరం నారాయణుడినే స్మరించిన ప్రహ్లాదుడు పితృద్రోహి కాకపోగా మహా భక్తుడు అని పిలవ బడటం ఏమిటి?' అని.

-సశేషం

## శ్రీ బాబూజీ దివ్యవాణి

ఎంతటి గొప్ప ధర్మమైనా దానిని అనుసరించెడివారాధర్మ సూత్రములను అత్యంత శ్రద్ధా భక్తులతో తమ జీవితమున అనుష్ఠించినప్పుడే అది చైతన్యవంతంగా విలసిల్లి మహిమాన్వితం కాగలుగుతుంది. హిందూధర్మ ప్రతిష్ఠాపనము విషయమున భారతదేశంలో వివిధ కాలములందు జన్మించిన మహాత్ములెల్లరునూ కొనసాగిస్తూ వచ్చిన మహా సత్కార్యమిదియే.

ఈ మహాత్ములిట్లు ప్రబోధన పరులగుటయేకాక జగత్కారణుడగు ఆ పరమాత్మ సైతం, ధర్మగ్లాని సంభవించినప్పుడెల్ల, మానవరూపంలోనో మరే రూపంలోనో తాను భూలోకానికి అవతరించి ధర్మరక్షణ చేస్తూ ఉంటానని చాటిన సంగతికూడా మన మెరిగినదే. (గీత నాల్గవ అధ్యాయం 7,8, శ్లోకాలు)

దీనిననుసరించియే, శ్రీరామ, శ్రీకృష్ణాద్యవతారాలు ఈ పుణ్య భూమి యందవతరించి తమ దివ్యసన్నిధిచే లోకులననుగ్రహించడం జరిగింది. ఇక, ధర్మానుష్ఠానమే తమ జీవిత లక్ష్యంగా ఇచట జన్మించిన మహాత్ములందరినీ లెక్కించటం ఎవ్వరికినీ సాధ్యముకానేరదు. ప్రజాదృష్టిని ఆకర్షించకుండ మరుగుననే ఉండిపోయిన వారెందరో! పూర్వ యుగాలలో శ్రీ దక్షిణామూర్తి స్వామి, శ్రీ దత్తాత్రేయస్వామి, వేద వ్యాసుడు, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, ఆధునిక యుగంలో గౌతమ బుద్ధుడు, శంకర భగవత్పాదులు, గురునానక్, శ్రీరామకృష్ణ పరమహంస,వివేకానందస్వామి , రామతీర్థ స్వామి, శ్రీ రమణ మహర్షి మొదలైన వారిని ప్రజాదృష్టినాకర్షించిన వారికి ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

ఇట్టి మహర్షుల, మహాత్ముల ఆశీర్వాద, సంకల్ప ప్రభావ కలిమిచేతనే హిందూధర్మము, భారత సంస్కృతి, భారతజాతి కూడా, వివిధ కాలములలో, విదేశీయుల దండయాత్రల వల్లనేమి, దేశీయులలోని సంకుచిత బుద్ధులు, స్వార్థ ప్రవృత్తుల వలననేమి, ఎంతటి విపత్తులు సంఘటిల్లుతూ వచ్చినా చైతన్యవంతంగా నిలద్రొక్కుకుని తేజరిల్లుతూ వచ్చింది. ఇదే కాలగతిలో, ఇతర దేశాలలోని జాతీయ సంస్కృతులెన్నియో పుట్టి పెరిగి, విలసిల్లి, మరల నిశ్శేషముగా అంతరించిపోవడం గమనించ దగినది.

అంతరాత్మతో మహాత్ముల వలె తాదాత్మ్యానుభవమూ, భౌతిక జీవన ప్రవృత్తులయెడ అట్టి సంపూర్ణ నిస్సంగత్వమూ ప్రతి మానవుడూ అలవరచుకోవాలని వేదాలు హెచ్చరిస్తూ, అట్టివారే అమృత స్వరూపులు కాగలరని, అసందిగ్ధంగా చాటి చెప్పుతూ వచ్చినవి. అట్టివారి ఆశీర్వాదం

పరమాత్మని ఆశీర్వాదమే, వారి సంకల్పమునకు గల కారణం కూడా ఆ పరమాత్మనిదే.

మన దేశంలో జన్మించిన మహాత్ములు పరమాత్మనుద్దేశించి ఎట్టి ప్రార్థనలు సల్పిరో, తోటి మానవులపై ఎట్టి ఆశీస్సులను కుమ్మరించిరో ఈ సందర్భంలో గమనించాలి. 'లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు, - లోకములన్నియు సుఖించునుగాక. అనగా తమ ప్రాంతము, తమ దేశము, తమ లోకమేగాక, ఈశ్వర సృష్టిలోని సమస్త లోకములూ సుఖించాలని వారి ఆశయం. ఎంతటి ఉదాత్త భావన అదీ!

'సర్వేజనా స్సుఖినో భవంతు - ఎల్ల జనులు అనగా, కుల, మత, జాతి, వర్ణ విభేదములు లేక ఎల్లవారునూ సుఖింతురుగాక. 'సర్వేషాం స్వస్తిర్భూయాత్! - ఎల్లరకునూ శుభమగుగాక, అట్లే 'సర్వేషాం శాంతి ర్భూయాత్', 'సర్వేషాం పూర్ణం భూయాత్ - అనగా ఎల్లరకూ సమస్తమూ ఒనగూడుగాక, 'సర్వే భద్రాణి పశ్యన్తు', 'సర్వే సంతు నిరామయా', - అనగా ఎల్లరునూ ఎట్టి ఆధివ్యాధులూ లేకుండా ఉందురుగాక. ఇట్టివే మన మహాత్ములు జగత్పతియైన పరమాత్మకు ప్రార్థన పూర్వకంగా తోటి మానవులపై వర్షిస్తూ వచ్చిన శుభాశీస్సులు.

భారతదేశ చరిత్రలోని రమ్యమైన పెక్కు ఉదాహరణలతో శ్రీహనుమత్ కాళీ వర ప్రసాదబాబు ఈ విషయమునే విశదీకరిస్తూ ఇంతటి విశాల దృష్టి ఇతర దేశాల చరిత్రలో కానరావడం దుర్ఘటం అన్నారు. ప్రతి మానవునిలోనూ పరమాత్మని దర్శింపనేర్చి మానవ సేవయే మాధవ సేవగా పరిగణించే అలవాటును ప్రతి హిందువు అలవరచుకొనుటచే పెంపొందగల సమ్యగ్దృష్టి ఇది.

ఉన్న యథార్థము కూడా ఇదే కదా. ఈశ్వర సృష్టిలోని చరాచరాత్మకమైన ప్రతి వస్తువునందునూ ఈశ్వర తేజో విస్ఫులింగం ఉండనే యున్నది. సమస్తమునకూ సత్తా ప్రవృత్తులూ ఆయన మూలమున ఏర్పడినవే. కావుననే భగవంతుడు విగ్రహము ద్వారా పూజించిన దానికంటే 'మానవ సేవ, భూతదయ ద్వారా జరిగిన పూజకే ఎక్కువగా తృప్తి చెందుతాడు. భగవంతుని సమీపించుటకు ఇంతకంటే సుగమమార్గం మరియేముంటుంది? సాధకునిలోని స్వార్థమునూ, లోభగుణమునూ పోగొట్టి, ఎల్లరి యెడల ప్రేమభావమును పెంపొందించి సంగరాహిత్యమును కలుగజేసి, భగవద్భక్తి, విశ్వాసములను వృద్ధి పొందించటం ద్వారా భగవదనుగ్రహ సంపాదనమునకు ఇదియే చక్కని దారి. *

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీబాబు తమ పర్యటనలో అక్కడక్కడ గ్రామాల్లో మజిలీ చేసేవారు. కాని గ్రామంలో కాక వెలుపల, ఏ చెరువు గట్టునో ఉండేవారు. చెరువులో స్నానం చేయటం, ఏ చెట్టు క్రిందనో కూర్చొని ధ్యానం చేసుకోవటం, అలాగే నిద్ర పోవటం జరిగేది. వారిని చూసిన అక్కడి గ్రామస్థులు పండో ఫలమో తెచ్చి ఇచ్చేవారు.



ఒక ఊరిలో ఇలాగే శ్రీబాబు ఊరి వెలుపల చెరువు గట్టున ఉండగా, ఒక రైతు శ్రీబాబు కోసం ఆ చెట్టు క్రిందనే ఒక నులక మంచం తెచ్చి వేశాడు. తరువాత ఒక చిన్న కుటీరం నిర్మించి ప్రతి రోజూ పాలు తెచ్చి ఇవ్వసాగాడు. రోజురోజుకు ప్రశ్నలు అడగటానికనో, సంసార సమస్యలతోనో, సలహాలకోసమో, జనం రాసాగారు. శ్రీబాబు కరుణా స్వరూపులు గనుక విసుగు చెందక, ప్రతి వారికి వారి సమస్యలకు సమాధానం చెబుతూనే వారిలో ఆధ్యాత్మిక చింతనను కలిగించేవారు. కొన్ని రోజులు జరిగేసరికి, ఉదయం నుండి సాయంత్రం వరకు జనం తరగకుండా వస్తూ ఉండటంతో, శ్రీబాబుకు సాధనకు సమయమే కరువైంది. అందువలన శ్రీబాబు ఆ రైతుకు విషయం చెప్పి, ఆ రాత్రే ఆ గ్రామం విడిచి వెళ్ళి పోయారు.

గ్రామాలలో మజిలీలు చేసినట్లే, శ్రీబాబు పట్టణాలలో కూడా అప్పుడప్పుడు మజిలీలు చేసేవారు. ఒకసారి పిఠాపురం రాజావారి ఆహ్వానంపై శ్రీబాబు వారింటికి భిక్షకు వెళ్ళారు. జమిందారిణి మహా భక్తురాలు. ఆమెకిద్దరు కొడుకులు. స్వామి యెడల భక్తి ప్రపత్తులు లేని ఆ యిరువురికి స్వామిని ఏదో 'తమాషా' చేయాలని బుద్ధి పుట్టింది. స్వామి స్నానానికి స్వయంగా ఏర్పాటు చేస్తామని చెప్పి వెళ్ళి, వాళ్ళు రెండు బక్కెట్లలో సలసల మరిగే నీళ్ళు పెట్టారు. చన్నీళ్ళు అసలు పెట్టలేదు. స్వామి మామూలుగా వెళ్ళి తలుపు వేసుకున్న తరువాత, వాళ్ళు దగ్గరలోనే ఒక చోట నిలబడి, లోపలి నుంచి ఏమైనా పిలుపు వినబడుతుందేమోనని శ్రద్ధగా చెవులు రిక్కించి వినసాగారు. తలుపు తీసి చన్నీళ్ళ కోసం అడుగుతారేమో అనుకున్నారు. కానీ లోపలకు వెళ్ళిన స్వామికి వాళ్ళ ఆలోచన అర్థమైపోయింది. గంగనే కబరీబంధంలో నిలిపిన ఆ కపర్దికి చన్నీళ్ళ కోసం అడగవలసిన అవసరం ఏమున్నది? జగత్తునే క్షణంలో భస్మం

చేయగల హాలాహలాన్నే, కంఠంలో ధరించిన ఆ గరళకంఠునికి ఈ మరిగే నీళ్ళు ఒక లెక్కా? హాయిగా జగన్మాత సంకీర్తన చేసుకుంటూ స్నానం చేసి బయటకు వచ్చారు. వారి ముఖాన ఎప్పటి వలెనే సహజ మందహాసము, ఆనందంగా తాండవిస్తూ, వాళ్ళిద్దరినీ ఉడికించింది. కానీ బయట పడితే పరువు తక్కువ కదా!

వాళ్ళు ఆశించిన 'తమాషా' మరో విధంగా జరిగింది. ఆ సాయంత్రం వారిద్దరు స్నానాలు చేసి బయటకు వచ్చేసరికి ఒళ్ళంతా భరించలేనంత మంటలు మొదలైనాయి. నిప్పుతో కాలుస్తున్నట్లున్న ఆ మంటలకు తోడు ఒంటి మీద కప్పుకున్న బట్ట కూడ మరింత మంట పుట్టించింది. ఎవరితోనూ చెప్పుకోలేరు. వాళ్ళ బాధ వర్ణనాతీతం. ఓర్చుకోడానికి ఎంతో ప్రయత్నం చేసి ఇక వాళ్ళ వల్ల గాక, వెళ్ళి అత్తగారితో చెప్పుకున్నారు.ఎందుకిలా జరిగిందో ఆవిడకు అర్థం కాలేదు. ఏ ఉపశాంతులతోనూ ఆ బాధ తగ్గక పోగాఎక్కువైంది. వాళ్ళు పోసుకున్న శుభ్రమైన గోరువెచ్చని నీళ్ళే ఆమె కూడా స్నానం చేసింది. మరి తనకు కలుగని మంటలు వాళ్ళకెందుకు కలిగాయి?

ఇక వాళ్ళ బాధా నివారణ కోసం ఆమె వారిని శ్రీబాబు వద్దకు తీసుకొని వెళ్ళింది. చిరునవ్వుతో స్వామి "అమ్మా! మీ వల్ల ఏదైనా పొరపాటు జరిగిందా?" అని అడిగారు. వాళ్ళు ఏమీ లేదని బుకాయించారు. "ఏమీ లేకపోతే అదే తగ్గిపోతుందిలే" అన్నారు శ్రీబాబు. కాని బాధ ఇంకా ఎక్కువైంది. వాళ్ళ అత్తగారికి అనుమానం వచ్చి, వాళ్ళను చాటుకు తీసుకుపోయి నిలదీసి "నిజం చెప్పండి. ఏదైనా అపరాధం తెలిసిగాని, తెలియకగాని చేసి ఉంటే, క్షమించమని శ్రీబాబును ప్రార్థించండి. లేకపోతే మీ గతి యింతే " అనిమందలించింది. గత్యంతరం లేక వాళ్ళు స్వామి పాదాలపై పడి తప్పును ఒప్పుకొని క్షమించమని ప్రార్థించారు. మరు క్షణంలో బాధ మటు మాయమైంది !

అప్పుడప్పుడు శ్రీబాబు పిఠాపురంలోనే వంగల దీక్షితులుగారనే సదాచార సంపన్నులైన బ్రాహ్మణుల యింటికి వెడుతూ ఉండేవారు. వెళ్ళినప్పుడల్లా వారింట్లో చాలా రోజులుండేవారు. ఆ గృహస్థులు ఎంత సదాచార సంపన్నులో అంత సంస్కారం కలవారు. బాలుడైన శ్రీబాబును తమ కుమారుల కంటె ఎక్కువ ప్రేమగా చూసుకునే వారు. క్షణం కూడా శ్రీబాబును విడిచి ఉండలేక పోయేవారు. రాత్రులందు కూడా తమ యిరువురి మధ్య శ్రీబాబును పరుండ బెట్టుకొనేవారు. అలా శ్రీబాబును కొన్ని దినములు తమ యింట్లో నిలుపుకున్న వారికి ఎన్నో శుభములు, సౌఖ్యములు సమకూరుతూ ఉండేవి. అంతకు మించిన శాంతి అక్కడ తాండవించేది. అందుచేత ఎన్నాళ్ళకైనా స్వామి వెళ్ళి పోవటానికి

వాళ్ళు యిష్టపడేవారు కాదు. అందులోనూ సామాన్య అతిధి వలె గాక, తమలో ఒకరై, అందరితో ఆనందంగా మాట్లాడుతూ ఆనందాన్నిఅందిస్తూ, అమూల్యమైన సలహాలతో, శారీరిక, మానసిక, సుఖ, శాంతులు అందజేస్తూ, బాలుని రూపంలో వచ్చిన పరమాత్ముని వలె అబ్బుర పరచే ఈ బాలుడు వారి హృదయంలో చెరగని ముద్ర వేసుకున్నాడు. ప్రయాణమై శ్రీబాబు వెళ్ళబోతే వాళ్ళు కాళ్ళకు అడ్డం పడి మరికొన్ని రోజులు ఉండమని అర్థించేవారు. "నేను మాత్రం మిమ్మల్ని విడిచి ఎక్కడికి వెళ్ళగలను బాబూ? నేనెక్కడ ఉన్నా మీరు నా హృదయంలోనే ఉంటారు. నేను మీ హృదయ నివాసినై సదా మీలోనే ఉంటాను'' అని అభయమిచ్చి మరీ కదిలి వెళ్ళే వారు శ్రీబాబు.

ఒరిస్సాలోని జయపూర్ మహారాజు విక్రమదేవ వర్మ గారు శ్రీబాబు యెడల ఎంతో భక్తి ప్రపత్తులు కలిగి ఉండేవారు. శ్రీబాబు తమ పర్యటన కాలంలో ఆయనకు అప్పుడప్పుడు దర్శనమిస్తూ ఉండేవారు. ఒకసారి ఆయన శ్రీబాబుతో "తమరు ఇంత లేత వయస్సులో సాధన కోసం యిలా దేశమంతటా పర్యటించటం, భరించరాని శ్రమకు గురి కావటం నాకు చాలా బాధ కలిగిస్తున్నది. తమకు ఒక చక్కని ఆశ్రమము ఏర్పాటు చేసి, ఆశ్రమ నిర్వహణ కోసం ఎంత ధనమైనా, సేవా భాగ్యంగా భావించి తమకు సమర్పించు కుంటాను. అనుమతించండి'' అని వేడుకున్నారు.

శ్రీబాబు "ఆశ్రమం కూడా ఒక జంజాటమే. సాధన, ధనము, ఈ రెండూ ఉత్తర, దక్షిణ ధ్రువాలవంటివి. ఈ రెండిటికి ఎన్నడూ పొత్తు కుదరదు. సాధకునికి ఏకాంతమును మించిన సౌకర్యము మరొకటి లేదు. ఇక దేశ పర్యటన అంటారా, జగన్మాత యొక్క విశ్వ రూపమును దర్శించటానికి అది ఎంతో దోహద పడుతున్నది. కరుణామయి అయిన ఆ తల్లి అందించే జ్ఞాన క్షీరమును గ్రోలుతున్న భాగ్యశాలికి దేహ భ్రాంతియే లేనప్పుడు, శ్రమ ఎక్కడిది? అయినా ఎంతో ధార్మిక చింతనతో, సంపదను సద్వినియోగం చేసుకోవాలని మీరు సంకల్పించటం నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నది. మీ వంటి త్యాగశీలురైన సంపన్నులు సంకల్పిస్తే, సామాన్య ప్రజలకు విద్య, వైద్యము, ఆహారము, వృత్తి, ఉద్యోగాలలో ఎంతో మేలు జరుగుతుంది. ఆ విధంగా మీరు జగన్మాత మీకు ప్రసాదించిన సంపదను మానవ సేవ ద్వారా సార్థకం చేసుకుని, మోక్ష సామ్రాజ్య దాయిని అయిన అమ్మ కృపకు పాత్రులు కావాలని నా ఆకాంక్ష'' అన్నారు.

-సశేషం




(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

"నారదుడు చెప్పాడు..." అని ఆగాడు. "నారదుడు ఏం చెప్పాడు మామా?" కృష్ణుడు అడిగాడు. సభామండపమంతా చీమ చిట్టుక్కుమంటే వినబడేటంత నిశ్శబ్దంగా ఉంది. ఆఖరికి గాలి కదిలిన శబ్దం కూడా వినిపిస్తున్న ఆ నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ, "నారదుడు అన్నాడు, కంసా! నీ వినాశనం దేవకి అష్టమ గర్భమైన వాని చేతిలో అవటం తథ్యం! అని." అతీతంలోని పేజీలను త్రిప్పుతూ ఆకాశం వైపు చూస్తూ కంసుడు మళ్ళీ ఇలా అన్నాడు "నేను ఆ వినాశం నుండి కాపాడుకోవాలని దేవకి అష్టమ గర్భ వినాశంకోసం ప్రయత్నం చేశాను కృష్ణా. నీ పట్ల నా వైరము మానవ సహజమైన ప్రవృత్తి వల్ల కలిగినదే. నేను నిన్ను చంపటానికి... నిన్ను హత్య చేయటానికి ఎన్నో ప్రయత్నాలు చేశాను... ఎందుకు? ఎందుకంటే నేను జీవించాలని. నిన్ను చంపాలను కోవటం నా మానవ సహజ ప్రవృత్తి. దేవర్షి నారదులు చెప్పిన భవిష్యవాణి చేత ప్రేరితుడనై అలా చేశాను." కంసుడు కొంచెం ఆగాడు. అతని గాయం నుండి రక్తం స్రవిస్తోంది. కొద్దిగా శ్వాస పీల్చుకొని బలవంతంగా ఇలా అన్నాడు.

"...కాని హే కృష్ణా! నా మృత్యువు కోసం నీ ప్రయత్నం... నా వినాశం కోసం నువ్వు చేసిన కర్మ నాకు అర్థం కాలేదు.. అది నా పట్ల నీకు ఉన్న ద్వేషమా..?

"దానిని ద్వేషం అనకండి మామా!" మధ్యలోనే కంసుని మాటలను ఆపుతూ, కృష్ణుడు అన్నాడు "మీరు దేవర్షి నారదుని భవిష్య వాణిని అతిక్రమించటానికి సన్నద్ధులైనారు... నేను... నేను గణతంత్ర పునస్థాపనకు నిమిత్తుడ నవాలని తలచాను...."

"అంటే...?"

"అదే! మీరు ఆర్యుల ఉజ్జ్వల పరంపర అయిన వ్రజభూమి గణతంత్రాన్ని నాశనం చేశారు. 'బహుజన హితాయ, బహుజన సుఖాయ' అన్న గణపరిషత్ చేసిన ప్రతిజ్ఞను మీరు ఉల్లంఘించారు. మీలో ఉన్న రాజ్యాధికార కాంక్షను మీరు అదుపులో పెట్టలేక పోయారు.."

"కృష్ణా...!" కంసుని వదనంపై చిరునవ్వు మెరిసి మాయమైంది.

"సామ్రాజ్యవాదం ఒక కొత్త పరంపర ఏమీ కాదు. ఆర్యకులం కూడా అపరిచితం కాదు. ఏ గణతంత్రమైతే..." కంసుని మాట తడబడింది.. అతడి కళ్ళలో నిప్పులు కురిశాయి. భృకుటి ముడిపడింది. "ఏ గణతంత్రం కుళ్ళిపోయిందో.. దేనిలో నిర్దోషులు, నిష్పాపులు అయిన స్త్రీలకు సమ్మానం లభించదో, ఏ గణతంత్రాన్ని పాలించేవాడు తన వ్యక్తిగత ప్రతిష్ఠకోసం తన ధర్మపత్నిని బహిష్కారం చేస్తాడో...."

"ఏమిటి మీరు అంటున్నది మామా..?" కృష్ణుడు కంసుని రక్తసిక్తమైన నుదిటిమీద చేయి వేసి అన్నాడు. చుట్టు ప్రక్కల నిలచి ఉన్న సముదాయం వైపు చూశాడు... వయో వృద్ధులైన సభాసదులు తలలు దించుకున్నారు.. "కృష్ణా!" కొంచెం బిగ్గరగా కంసుడు అన్నాడు. తలలు దించుకొన్న బుధ జనుల ముఖం మీద ఉమ్మి వేస్తున్నట్లుగా అతడు రక్త వమనం చేసుకున్నాడు. "గణతంత్రానికి రక్షకులుగా ఉన్న వారిని అడుగు, నా తల్లిని నిందితురాలుగా ఎలా నిర్ధారించారు? ఎందువలన ఆమెను అంతగా తిరస్కరించారు? నిష్పాపి, పవిత్రురాలు అయిన ఆ స్త్రీ పతివ్రతాధర్మాన్ని నిందిస్తూ ఆమె పతి ఎందుకు ఆమెను తూలనాడాడు? తన ధర్మపత్ని సమ్మానాన్ని కాపాడలేని పతికి గణతంత్రంపైన శాశించే అధికారం ఉందా?"

కృష్ణుడు స్థిర దృష్టితో సభాజనులందరి వైపు చూశాడు. ఎవ్వరూ తల ఎత్తలేదు.. కృష్ణునికి మౌనమే సమాధానంగా వచ్చింది.

"వీరిలో ఎవరూ ఏమీ మాట్లాడరు కృష్ణా!" కంసుడు తిరిగి అన్నాడు. "వీరంతా నిర్మాల్యంలాంటివారు. గణతంత్రం సమాప్తమైన తరువాత వీరందరు నాకు జయ జయకారాలు చేశారు. ఇప్పుడు వీరు మీకు జయనాదాలు చేస్తారు. ఏ క్షణంలో గణాధిపతి ఉగ్రసేనుడు తన పత్ని అంటే నా తల్లి చరిత్రకు కళంకం ఆపాదించి నా జన్మకు నీచత్వాన్ని అంటగట్టాడో, ఆ క్షణాన్నే వారి నోళ్ళకు తాళాలు పడ్డాయి... నన్ను యాదవునిగా స్వీకరించని ఈ కాపురుషులు ఇప్పుడు కూడా నేనంటే భయపడతారు.."

"మామా! మామా! మీరు... మీరు... యాదవులు కాదనేవారు పాపులు..." కృష్ణుని వాక్యం ఇంకా పూర్తి కాలేదు....

"కృష్ణా!" ఉన్నట్లుండి అక్రూరుని స్వరం వినిపించింది... "కంసుని మాటలలో సత్యం ఉంది కేశవా! కంసుని తల్లి... " అంటూ ఆగి అక్రూరుడు కంసునివైపు చూశాడు. కంసుడు మృత్యు ముఖంలో ఉన్నాడు.

"భయపడకు అక్రూరా!" కంసుడు అన్నాడు, "అలా మాట్లాడే ధైర్యం ఒక ఘడియ క్రితం ఎవరైనా చేసి ఉంటే వారి తలలు వారి శరీరాన్నించి వేరై ఉండేవి! కాని ఇప్పుడు... ఇప్పుడు కృష్ణునితో చెప్పు తండ్రీ! కంసుని నిష్పాపి అయిన తల్లిని మీరు ఈ గణతంత్రంలో ఎలా పాపిగా నిలబెట్టారో... అలా పాపినిగా నిర్ణయించిన స్త్రీకి కంసుడు రాజమాన్యం... లోకమాన్యం ఎలా కలిగించాడో - అది చెప్పండి తండ్రీ! " కంసుడి మాటలు ఆగిపోయాయి..."

సభామండపం అంతా శిలాప్రతిమలాగా స్తబ్ధంగా అయింది.... అంతఃపురంలో రోదిస్తున్న రాణివాస స్త్రీల ఏడుపులు మాత్రం సన్నగా వినిపిస్తున్నాయి... మహా సమర్థుడైన కంసుడు ఇంకా జీవించిచే ఉన్నాడు. అతడు గోకుల కృష్ణుణ్ణి చూస్తున్నాడు... అంతకు పూర్వం వీరిద్దరిని చూసిన పురజనులు... సభాసదులు కంసుని మరణం మాట అలా ఉంచి అతని పరాజయం అసంభవం అని అనుకొన్నారు... ఒక్క అక్రూరుడు మాత్రమే కంసుడు పరాజయం పొందుతాడు అని ఊహించాడు. అక్రూరుడు కంసుణ్ణి సర్వాధికంగా అభిమానించిన మంత్రి - ఇంకా గణతంత్రం పునర్జన్మ?.. అది ఎవ్వరూ స్వప్నంలో కూడా ఊహించలేదు.... ఇంతవరకు అపరిచితుడుగా ఉన్న గోపాలకుని చేతిలోకి గణతంత్రం వస్తుందని ఎవరూ అనుకోలేదు. అందరూ కనురెప్ప వేయటం కూడ మరచి చూస్తున్నారు.

కంసమహారాజా! అక్రూరుడు అందరికి వినిపించేటట్లుగా కంసుని సంబోధిస్తూ "ఇహలోకంలోని ఈ స్మృతులను ఇక్కడే వదలి పరలోకగమనం చేయాల్సి ఉంటుంది... మీ తండ్రి ఉగ్రసేనుడు అప్పుడు ఏది చేసినా అది సమగ్ర యాదవకుల మానమర్యాదలను రక్షించటానికే కదా!" అన్నాడు.

"అక్రూరా! దయచేసి నా అంతిమ సమయంలో నాకు మీరు ఇదేమీ వినిపించవద్దు" అన్నాడు కంసుడు. కంసుడు తిరిగి తన శక్తినంతా కూడ దీసుకుంటూ "ఉగ్రసేనుడు నాకు తను తండ్రి అని ఎన్నడూ అనలేదు. ఆ పితృత్వం పేరిట మానమర్యాదల గురించి ఏమిటి మాట్లాడుతున్నారు? గణతంత్రం... ఇది మీవంటి వారు సృష్టించిన దంభతంత్రం" కంసుడు ఆపైన ఏమీ మాట్లాడలేకపోయాడు.

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,